# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక PEN POWER TELUGU DAILY ప్రశ్నించడం మన హక్కు

సంపుటి : 1 సంచిక : 302 పేజీలు : 8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ ) ప్రచురణ : తాడేపల్లిగూడెం ఆదివారం 6 సెప్టెంబర్ 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 302 PAGES : 8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : THADEPALLI GUDEM SUN 6 SEPTEMBER 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur







## ఉద్యోగులకు గుడ్‌న్యూస్..
## పీఆర్సీకి సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్

- ఉద్యోగ సంఘాలతో సీఎం చంద్రబాబు సమావేశం
- పలు కీలక డిమాండ్లకు సానుకూలంగా స్పందించిన ప్రభుత్వం
- 12వ పీఆర్సీ ఏర్పాటుకు, రెండు డీఏల విడుదలకు అంగీకారం
- సరెండర్ లీవులు, అదనపు పెన్షన్ క్వాంటంపై కీలక నిర్ణయాలు
- ప్రభుత్వంపై ఏటా రూ. 2880 కోట్ల అదనపు భారం



- మిగతా 2లో

## మేం సిద్ధం.. స్థానిక పోరు నుంచి చంద్రబాబులా పారిపోం

- స్థానిక ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేస్తామన్న గుడివాడ అమర్నాథ్
- ఎన్నికల్లో పోటీ చేయడానికి కూటమి పార్టీలు వణుకుతున్నాయని ఎద్దేవా
- ఎన్నికల నుంచి తప్పించుకునేందుకు దిగజారుడు యత్నాలు చేస్తున్నారని విమర్శ

పెన్ పవర్ డెస్క్:త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో వైసీపీ కచ్చితంగా పోటీ చేసి తీరుతుందని ఆ పార్టీ నేత, మాజీ మంత్రి గుడివాడ అమర్నాథ్ స్పష్టం చేశారు. తమ అధినేత జగన్ ఎప్పుడూ ఎన్నికల బరి నుంచి తప్పించుకునే నాయకుడు కాదని అన్నారు. వైసీపీ హయాంలో స్థానిక ఎన్నికలు నిర్వహించినప్పుడు చంద్రబాబు భయపడి పారిపోయారని ఎద్దేవా చేసిన ఆయన, ప్రజాస్వామ్యంలో గెలుపోటములను ప్రజల తీర్పు ద్వారానే తేల్చుకోవాల్సి

- మిగతా 2లో



## 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు



పెన్ పవర్ డెస్క్:ఆంధ్రప్రదేశ్‌లో విద్యావ్యవస్థను దేశంలోనే అగ్రగామిగా నిలపడమే లక్ష్యమని, అందుకోసం తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందని రాష్ట్ర మానవ వనరుల అభివృద్ధి, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ స్పష్టం చేశారు. 2029లోగా మరో మూడు మెగా డీఎస్సీలు నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలను భర్తీ చేస్తామని ఆయన కీలక ప్రకటన చేశారు. ఉపాధ్యాయ దినోత్స వాన్ని పురస్కరించుకుని విజయవాడలో శనివారం జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమంలో మంత్రి లోకేశ్ ప్రసంగించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే మెగా డీఎస్సీ ఫైలుపైనే తొలి సంతకం చేశారని, ఇచ్చిన మాటకు కట్టుబడి 16,000 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ప్రక్రియను పారదర్శకంగా చేపట్టామని తెలిపారు. "సీబీఎన్ అంటే డీఎస్సీ, డీఎస్సీ అంటే సీబీఎన్" అని అభివర్ణించిన లోకేశ్, చంద్రబాబు నాయకత్వంలో గతంలో 14 డీఎస్సీల ద్వారా సుమారు రెండు లక్షల మంది ఉపాధ్యాయులను నియమించిన ఘనత ఆయనదేనని గుర్తుచేశారు. పని చేసేవాళ్లకే రాళ్ల

- మిగతా 2లో

## టీచర్ స్థానాన్ని మరో టీచర్ తోనే
## భర్తీ చేయగలం

- ఉపాధ్యాయ దినోత్సవం
- విజయవాడలో నిర్వహించిన కార్యక్రమానికి సీఎం చంద్రబాబు హాజరు
- సీఎంగా మెగా డీఎస్సీపైనే తొలి సంతకం చేశానని వెల్లడి
- టెక్నాలజీ పెరిగినా గురువు స్థానాన్ని ఎవరూ భర్తీ చేయలేరని స్పష్టం
- చిన్నప్పుడు టీచర్ చేతిలో దెబ్బలు తిన్న విషయాన్ని గుర్తుచేసుకున్న సీఎం
- తల్లిదండ్రుల తర్వాత విద్యార్థి జీవితాన్ని తీర్చిదిద్దేది గురువేనని వ్యాఖ్య



పెన్ పవర్ డెస్క్:రాష్ట్ర అభివృద్ధికి ఉపాధ్యాయ నియామకాలు అత్యంత కీలకమని, అందుకే ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే మెగా డీఎస్సీ ఫైలుపై తొలి సంతకం చేశానని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. విజయవాడలో శనివారం జరిగిన ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఏళ్ల తరబడి సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు న్యాయం చేసేందుకు, న్యాయపరమైన చిక్కులను అధిగమించి మెగా డీఎస్సీని నిర్వహించి ఉద్యోగాలు కల్పించామని తెలిపారు. ఈ సందర్భంగా తన చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ, భక్తవత్సలం అనే గురువు చేతిలో తాను దెబ్బలు తిన్నానని చెప్పారు. అయితే, గురువుల వల్లే తాను ఈ స్థాయికి వచ్చానని అన్నారు. భారతీయ సంస్కృతిలో "మాతృదేవో భవ, పితృదేవో భవ" తర్వాత "ఆచార్య దేవో భవ" అని గురువుకే అత్యంత ప్రాధాన్యత ఇచ్చారని గుర్తుచేశారు. విద్యార్థులు ఎక్కువ సమయం పాఠశాలలోనే గడుపుతారని, వారిలో దాగి ఉన్న శాస్త్రవేత్తలను, క్రీడాకారులను గుర్తించి ప్రోత్సహించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని సూచించారు. టెక్నాలజీ, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రూపంలో ఎన్ని మార్పులు వచ్చినా, ఒక ఉపాధ్యాయుడి స్థానాన్ని మరో ఉపాధ్యాయుడు మాత్రమే భర్తీ చేయగలరని చంద్రబాబు అన్నారు. విద్యార్థులు కేవలం పుస్తకాల్లోని పాఠాలే కాకుండా, బయటి ప్రపంచం గురించి కూడా

- మిగతా 2లో




## చంద్రబాబు జిల్లా పర్యటనలు కూటమి మధ్య కలతలు రేపుతున్నాయా?

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు జిల్లాల పర్యటనలు కూటమిలోని మిత్ర పక్షాల నేతల మధ్య విభేదాలు తెలెత్తేలా చేస్తున్నాయి. చంద్రబాబు నియోజకవర్గాల పర్యటనలో పనిచేయని అధికారులను సహజంగా హెచ్చరిస్తుంటారు. వారి పనితీరుకు మార్కులు కూడా వేస్తుంటారు. అలాగే ఎమ్మెల్యేలకు కూడా రేటింగ్ లు ఇస్తారు. కొందరు టీడీపీ ఎమ్మెల్యేల పనితీరుపైనే చంద్రబాబు గతంలో అసంతృప్తి వ్యక్తం చేశారు. అయితే జనసేన ఎమ్మెల్యేను కూడా పనితీరు బాగాలేదని అనడంపై గ్లాస్ పార్టీలో ఒకింత అసహనం మొదలయింది. నియోజవర్గం ప్రజల ముందు తమ పార్టీ ఎమ్మెల్యేను అవమానించడమేంటని జనసేన నేతలు ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వం నిధులు ఇస్తే నియోజకవర్గాలను అభివృద్ధి చేస్తామని జనసేన నేతలు అంటున్నారు.

**నరసాపురం పర్యటనలో...**

కూటమిలో నరసాపురం జనసేన పార్టీ ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్ ఉద్దేశించి చంద్రబాబు నాయుడు బహిరంగ సభలో చెప్పిన మాటలు ఆపార్టీలో అసంతృప్తికి కారణమయయాయి. “పనితీరు బాగోలేదు. మీరు, నియోజకవర్గ అధికారులు సక్రమంగా పనిచేయడం లేదు. జిల్లా మొత్తం పనితీరు బాగానే ఉంది, కానీ మీ నియోజకవర్గం మాత్రం బాగోలేదు. దాదాపు అన్ని అంశాల్లోనూ మీరు మైనస్‌లో ఉన్నారు. 25 సూచికల్లో 23 ప్రతికూలంగా ఉన్నాయి. ఇది ఏమాత్రం ఆమోదయోగ్యం కాదు.ఎమ్మెల్యేగా మీరు తప్పనిసరిగా పనిచేయాలి. నరసాపురం నియోజకవర్గం వెనుకబడిపోయింది. సమస్యలను నా దగ్గరకు తీసుకురావడం మాత్రమే కాకుండా, ప్రజల సహకారంతో వాటిని మీరే పరిష్కరించాలి. నోడల్ అధికారిని మార్చి, చురుకుగా పనిచేసే అధికారిని నియమించండి.” అంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలను జనసేన నేతలు తప్పుపడుతున్నారు.

**ముందు మీ పార్టీ ఎమ్మెల్యేను...**

ఒక ఎమ్మెల్యే పనితీరును ప్రజల సమక్షంలో బహిరంగంగా ప్రశ్నించడం మంచి పరిణామమే అయినా , ఇలాంటి మంచి సంప్రదాయాన్ని ముందుగా తన బావమరిది, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నియోజకవర్గంలోనో, లేదా దెందులూరు నియోజకవర్గంలో తాను ఏరికోరి తీసుకొచ్చిన తనకు అత్యంత ప్రీతిపాత్రుడైన ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ గారి నియోజకవర్గంలోనో ప్రారంభించి ఉంటే మరింత సమంజసంగా ఉండేదని కొందరు సోషల్ మీడియాలో అభిప్రాయపడుతన్నారు. ప్రజల ముందు ఎమ్మెల్యేల పనితీరుపై ప్రశ్నించే ఈ మంచి సంప్రదాయం అందరికీ సమానంగా వర్తిస్తేనే దానికి నిజమైన విలువ ఉంటుంది, కూటమికి మంచి జరుగుతుందని అంటున్నారు. జనసేన ఎమ్మెల్యేను ప్రజల ముందు ముఖ్యమంత్రి నిలదీయడాన్ని జనసేన నేతలు, ఆ పార్టీ కార్యకర్తలు తప్పుపడుతున్నారు. జనసేన ఎమ్మెల్యేలు ఉన్న చోట టీడీపీ నేతల పెత్తనం సాగుతుందన్న విషయాన్ని గుర్తుంచుకోవాలని అంటున్నారు.

## ఉక్రెయిన్‌పై దాడులకు విరామం - పుతిన్ ఆదేశం

- మొదటి పేజి తరువాయి

దౌత్య చర్చల కోసం అమెరికా ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్ శనివారం (సెప్టెంబర్ 5) రష్యా చేరుకున్నారు.

అమెరికా ప్రతినిధుల రాక నేపథ్యంలో శనివారం నుంచి ఉక్రెయిన్?పై మూడు రోజుల పాటు దాడులను నిలిపివేయాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఆదేశించారు. పుతిన్ ఆదేశాలతో రష్యా సైన్యం ఉక్రెయిన్?పై దాడులకు తాత్కాలిక విరామం ఇచ్చింది. మొదటగా ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ ఈ తాత్కాలిక కాల్పులు విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించాడు. అమెరికా ప్రతినిధులు రష్యా, ఉక్రెయిన్ దేశాలలో పర్యటించే సమయంలో తాము కూడా ఎలాంటి దాడులు చేయబోమని, రష్యా కూడా అదే రీతిలో స్పందించాలని కోరారు. ఉక్రెయిన్ ప్రతిపాదించిన తాత్కాలిక సీజ్ ఫైర్ ఒప్పందానికి తాజాగా రష్యా అంగీకరించింది. దీంతో ఇరుదేశాల మధ్య మూడు రోజుల పాటు యుద్ధం ఆగిపోనుంది.నాలుగున్నరేండ్లుగా సాగుతోన్న రష్యా ఉక్రెయిన్ యుద్ధానికి ముగింపు పలికేందుకు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ప్రయత్నిస్తున్నాడు. ఇందులో భాగంగానే ఇరుదేశాల ప్రతినిధులతో దౌత్యపరమైన చర్చలు జరిపేందుకు స్టీవ్ విట్కాఫ్, జారెడ్ కుష్నర్?లతో కూడిన ప్రత్యేక బృందాన్ని రష్యాకు పంపాడు. అమెరికా టీమ్ యుద్ధం ముగింపు కోసం రష్యా, ఉక్రెయిన్ అధ్యక్షులతో చర్చలు జరపనుంది. మాస్కోలో పుతిన్‌తో చర్చలు ముగిసిన తర్వాత ఈ అమెరికా ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఆదివారం ఉక్రెయిన్ రాజధాని కీవ్‌కు చేరుకుని జెలెన్‌స్కీతో సమావేశం కానుంది.

# ఉద్యోగులకు గుడ్‌న్యూస్.. పీఆర్సీకి సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్

అమరావతి: ఏపీలో ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్‌న్యూస్ చెప్పింది. వేతన సవరణ సంఘం (పీఆర్సీ) ఏర్పాటుతో పాటు మరికొన్ని సమస్యలను పరిష్కరించేందుకు సీఎం చంద్రబాబు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఉద్యోగ సంఘాల నేతలతో నిర్వహించిన సమావేశంలో వివిధ అంశాలపై సీఎం చర్చించారు. అక్టోబర్ 1 నుంచి రెండు డీఏలు చెల్లించేందుకు ప్రభుత్వం అంగీకారం తెలిపింది. 2022 నాటి సరెండర్ లీవ్‌లు జనవరిలో ఇవ్వాలని నిర్ణయించింది. అనంతరం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ వివరాలు వెల్లడించారు. సీఎం చంద్రబాబుతో ఉద్యోగ సంఘాల సమావేశం మంచి వాతావరణంలో జరిగిందని సూర్యనారాయణ తెలిపారు. పీఆర్సీతో పాటు రెండు డీఏలు, ఒక ఏడాది సరెండర్ లీవ్‌లు, రిటైరైనవారికి అడిషనల్ క్వాంటం ఆఫ్ పెన్షన్ రీస్టోరేషన్, ఈహెచ్‌ఎస్ బకాయిలు ప్రతి నెలా ఒకటో తేదీన ట్రస్ట్‌కి చెల్లింపు తదితర సమస్యల పరిష్కారానికి సీఎం హామీ ఇచ్చారన్నారు. ఉద్యోగుల పట్ల సానుకూలంగా ఉండాలని తాము కోరామని సూర్యనారాయణ తెలిపారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఐఆర్ విషయంపై కొంత సమయం ఇవ్వాలని సీఎం చెప్పారన్నారు. అనంతరం ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు విద్యాసాగర్ మాట్లాడుతూ సానుకూల వాతావరణంలో సీఎంతో చర్చలు జరిగాయన్నారు. పొరుగు సేవల సిబ్బందిని ప్రభుత్వ పథకాల్లో లబ్ధిదారులుగా చేర్చాలని, గ్రామ సచివాలయ సిబ్బందికి నోషనల్ ఇంక్రిమెంట్ ఇవ్వాలని కోరామన్నారు. సీఎం ప్రకటనపై ఉద్యోగ సంఘాల నేతలు సంతృప్తి వ్యక్తం చేశారు.

## 2029 నాటికి మరో మూడు డీఎస్సీలు

- మొదటి పేజి తరువాయి

దెబ్బలు తగులుతాయని, ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని వారు తనపై విమర్శలు చేస్తున్నా పట్టించుకోనని అన్నారు. “ఓటమిని అంగీకరించడం అనేది నా డిక్షనరీలో లేదు. చిన్న చిన్న స్పీడ్ బ్రేకర్లు వస్తుంటాయి. కానీ నా లక్ష్యం ఒక్కటే.. అంగన్‌వాడీ నుంచి పీజీ వరకు ‘ఆంధ్ర మోడల్ ఆఫ్ ఎడ్యుకేషన్’ను ప్రపంచంలోనే నెంబర్ వన్ చేయడం” అని లోకేశ్ ధీమా వ్యక్తం చేశారు.దశాబ్దాలుగా ఖాళీగా ఉన్న యూనివర్సిటీ ఫ్యాకల్టీ పోస్టుల భర్తీపైనా మంత్రి కీలక ప్రకటన చేశారు. వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి ప్రొఫెసర్లు, అసోసియేట్, అసిస్టెంట్ ప్రొఫెసర్ల నియామక ప్రక్రియను అత్యంత పారదర్శకంగా పూర్తి చేసి, ప్రభుత్వ విశ్వవిద్యాలయాలకు కొత్త జవసత్వాలు అందిస్తామని హామీ ఇచ్చారు. ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్స్‌లో ఆంధ్రప్రదేశ్‌ను అగ్రస్థానంలో నిలపడమే లక్ష్యంగా పనిచేస్తామన్నారు.

**గత ప్రభుత్వానికి, ప్రజా ప్రభుత్వానికి తేడా ఇదే..**

గత ప్రభుత్వం తీసుకొచ్చిన వివాదాస్పద జీవో 117 కారణంగా సుమారు 12 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలను వీడి ప్రైవేటుకు వెళ్లారని లోకేశ్ ఆరోపించారు. తమ ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే ఆ జీవోను రద్దు చేసిందని, ఉపాధ్యాయ సంఘాలు, ప్రజాప్రతినిధులతో చర్చించి ‘మోడల్ ప్రైమరీ స్కూల్’ వ్యవస్థను తీసుకొచ్చామని వివరించారు. దీని ఫలితంగా ఈ ఏడాది ఏకంగా 1.10 లక్షల మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలల నుంచి ప్రభుత్వ బడుల్లో చేరారని, ఈ ఘనత పూర్తిగా ఉపాధ్యాయులదేనని ప్రశంసించారు. ఉపాధ్యాయుల సర్వీస్ విషయాల్లో పారదర్శకత కోసం ‘లీప్ యాప్’ను తీసుకొచ్చామని, బదిలీల ప్రక్రియను కూడా పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు.

**ప్రతి విద్యార్థి ప్రాణం విలువైందే..**

ఈ సందర్భంగా ఇటీవల జరిగిన ఓ విషాదకర ఘటనను ప్రస్తావిస్తూ లోకేశ్ భావోద్వేగానికి గురయ్యారు. పేరెంట్–టీచర్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి పక్కన కూర్చుని మాట్లాడిన ఓ విద్యార్థిని రెండు రోజులకే ఆత్మహత్య చేసుకోవడం తనను, ముఖ్యమంత్రిని తీవ్రంగా కలచివేసిందని అన్నారు. “ప్రతి బిడ్డ ముఖ్యమే, ప్రతి ప్రాణం విలువైందే (ఎవ్రీ చైల్డ్ మ్యాటర్స్, ఎవ్రీ లైఫ్ మ్యాటర్స్). పిల్లల్లో ఏ చిన్న మార్పు కనిపించినా ఉపాధ్యాయులు గమనించాలి. వారిలో మానసిక స్థైర్యాన్ని, ఒత్తిడిని తట్టుకునే శక్తిని పెంచాల్సిన బాధ్యత మనందరిపై ఉంది” అని పిలుపునిచ్చారు. ఇందుకోసం త్వరలోనే ప్రత్యేక కార్యక్రమాన్ని రూపొందిస్తామని తెలిపారు. ఫెయిల్ (ఖీూ×ూ) అంటే ‘ఫస్ట్ అటెంప్ట్ ఇన్ లెర్నింగ్’ అని పిల్లలకు నేర్పించాలని సూచించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు విద్యారంగంపై చూపిస్తున్న శ్రద్ధను వివరిస్తూ, మధ్యాహ్న భోజనాన్ని స్వయంగా రుచి చూసి, నాణ్యత పెంచాలని ఆదేశించారని గుర్తుచేశారు. ఆయన స్ఫూర్తితోనే నాణ్యమైన బియ్యాన్ని అందిస్తున్నామన్నారు. ఏపీజే అబ్దుల్ కలాం, సావిత్రిబాయి ఫూలే వంటి మహనీయులను ఉదాహరణగా చూపుతూ, ఒక ఉపాధ్యాయుడు తలచుకుంటే అద్భుతాలు సృష్టించగలడని, విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దగలడని అన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సింగపూర్, ఫిన్లాండ్ వంటి దేశాలకు విద్యా పర్యటనలకు పంపి, అక్కడి ఉత్తమ విధానాలను ఇక్కడ అమలు చేస్తామని లోకేశ్ హామీ ఇచ్చారు.

## ఢిల్లీని ముంచెత్తిన భారీ వర్షం.. రెడ్ అలర్ట్ జారీ!

దేశ రాజధాని ఢిల్లీతో పాటు దాని పరిసర ప్రాంతాలను (ఎన్‌సీఆర్) శనివారం ఉదయం కూడా కుండపోత వర్షం ముంచెత్తింది. భారీ వర్షాల కారణంగా అనేక ప్రాంతాలు జలమయమవడంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఢిల్లీకి ‘రెడ్ అలర్ట్’ జారీ చేసింది. వర్షాల వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు, విమాన సర్వీసులపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని అధికారులు వెల్లడించారు.

భారీ వర్షాల నేపథ్యంలో ఇండిగో, ఎయిర్ ఇండియా వంటి విమానయాన సంస్థలు ప్రయాణికులకు పలు సూచనలు జారీ చేశాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల విమాన సర్వీసులు ఆలస్యమయ్యే అవకాశం ఉందని, ప్రయాణికులు తమ విమాన ప్రయాణ స్థితిగతులను ముందుగానే తనిఖీ చేసుకోవాలని సూచించాయి.

రోడ్లపై నీరు నిలిచిపోవడంతో విమానాశ్రయానికి చేరుకోవడానికి అదనపు సమయం పట్టవచ్చని హెచ్చరించాయి. అయితే, ఇందిరా గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో విమాన రాకపోకలు ప్రస్తుతానికి సాధారణంగానే కొనసాగుతున్నాయని విమానాశ్రయ నిర్వహణ సంస్థ జీఎంఆర్ స్పష్టం చేసింది.నగర పరిధిలోని కన్నాట్ ప్లేస్ ఔటర్ సర్కిల్, గీతా కాలనీ, అక్బర్ రోడ్ వంటి ప్రధాన ప్రాంతాలు జలమయమయ్యాయి. కన్నాట్ ప్లేస్‌లో మోటార్ల సాయంతో నీటిని తోడివేస్తున్నప్పటికీ, కొన్ని దుకాణాల్లోకి వర్షపు నీరు చేరింది. గ్రేటర్ నోయిడా, నోయిడా ప్రాంతాల్లోనూ భారీ వర్షపాతం నమోదైంది.

ఈ వర్షాల ప్రభావంతో ఢిల్లీ వాసులకు ఉక్కపోత నుంచి ఉపశమనం లభించింది. నగరంలో కనిష్ఠ ఉష్ణోగ్రత 24.8 డిగ్రీల సెల్సియస్‌కు పడిపోయింది. అయితే, ఆదివారం నుంచి వర్షాలు తగ్గుముఖం పట్టే అవకాశం ఉందని, సెప్టెంబర్ 7 నుంచి కేవలం తేలికపాటి జల్లులు మాత్రమే కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేసింది.

## విద్యార్థులను తరగతి గదికే పరిమితం చేయకూడదు

- మొదటి పేజి తరువాయి

వారి దైనందిన జీవితాలపై కూడా టీచర్లు శ్రద్ధ వహించాలని సూచించారు. నేటి సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ తగ్గిపోతోందని.. ఈ సమయంలో ఉపాధ్యాయులే విద్యార్థులను సరైన దారిలో నడిపించాలని పేర్కొన్నారు. మాదకద్రవ్యాల సమస్యను ప్రస్తావిస్తూ.. పిల్లలు ఏం చేస్తున్నారు, ఎలాంటి అలవాట్లు చేసుకుంటున్నారనే విషయాలను నిరంతరం గమనిస్తూ ఉండాలన్నారు. “విద్యార్థులు స్క్రీన్ చూసే సమయాన్ని తగ్గించడం ప్రస్తుతం చాలా అవసరం. క్రీడలు, సృజనాత్మక ఆవిష్కరణలపై వారిలో ఆసక్తిని పెంపొందిస్తే.. ఫోన్‌కు దూరంగా ఉంచొచ్చు. అంతేకాదు, నూతన సాంకేతికతలపై వారికి ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలి. బోధనతో విద్యార్థుల్లో చాలా మార్పు తీసుకురావచ్చు. విద్యార్థులు తమ కలలను సాకారం చేసుకోవడంలో ఉపాధ్యాయులు కీలక పాత్ర పోషిస్తారు. ప్రతి చిన్నారిలో ఒక ప్రతిభ ఉంటుంది. దానిని ఉపాధ్యాయులు గుర్తించి, ప్రోత్సహిస్తే వారు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోగలరు. పిల్లలను తరగతి గదికే పరిమితం చేయకూడదు. వారిని బయటకు తీసుకువెళ్లి.. నిజ జీవిత నైపుణ్యాలు, సమాజ పరిస్థితులపై అవగాహన కల్పించాలి. సిలబస్‌తో పాటు నైతిక విలువలూ నేర్పాలి” అని మోదీ ఉపాధ్యాయులకు సూచించారు.

**82 మంది ఉపాధ్యాయులకు అవార్డులు..**

ఈ ఏడాది 82 మంది ఉపాధ్యాయులు (ఞముఎష్త్రవతీం), విద్యావేత్తలు జాతీయ ఉపాధ్యాయ పురస్కారాలకు ఎంపికయ్యారు. వీరిలో పాఠశాల విద్య అక్షరాస్యత శాఖ నుంచి 48 మంది ఉపాధ్యాయులు, ఉన్నత విద్యా సంస్థలు, పాలిటెక్నిక్‌ల నుంచి 21 మంది అధ్యాపకులు.. నైపుణ్యాభివృద్ధి, వ్యవస్థాపకత విభాగం నుంచి 13 మంది నైపుణ్య శిక్షకులు ఉన్నారు. పురస్కార గ్రహీతలు తమ బోధనా పద్ధతులు, అనుభవాలను ప్రధానితో పంచుకున్నారు.

## ‘ఆపరేషన్ సిందూర్’ దెబ్బ.. భారత్‌పై పాక్ కొత్త ఉగ్ర వ్యూహం

భారత్‌పై ఉగ్రవాద వ్యూహాన్ని పాకిస్థాన్ మార్చుకుంటున్నట్లు నిఘా వర్గాలు చెబుతున్నాయి. నేరుగా పాక్ సంబంధాలు బయటపడకుండా కొత్త పద్ధతులను అనుసరిస్తున్నట్లు పేర్కొన్నాయి. ముఖ్యంగా ‘ఆపరేషన్ సిందూర్’ తర్వాత ఉగ్రవాద వ్యూహాన్ని పాకిస్థాన్ పూర్తిగా మార్చినట్లు అధికారులు తెలిపారు. పాక్ కేంద్రంగా పనిచేసే లష్కరే తోయిబా, జైషే మహమ్మద్, హిజ్బుల్ ముజాహిదీన్ వంటి సంస్థల పాత ఉగ్ర మాన్యువల్స్‌ను వాడటం తగ్గించినట్లు సమాచారం. ఇవి భారత దర్యాప్తు సంస్థలకు బాగా పరిచయం కావడంతో దాడుల వెనుక పాక్ సంబంధాలను గుర్తించడం సులభమవుతుందని అధికారులు చెబుతున్నారు.ఇప్పుడు అల్‌ఖైదా, ఇస్లామిక్ స్టేట్ పేరుతో ఉన్న మార్గదర్శకాలను విదేశాల్లోని హ్యాండ్లర్లు ఉపయోగిస్తున్నట్లు వెల్లడించారు. గతంలో ఇస్లామాబాద్, కరాచీ, రావల్పిండి నుంచి ఆదేశాలు వచ్చేవని చెప్పారు. ప్రస్తుతం సిరియా, ఇరాక్ వంటి ప్రాంతాల నుంచి హ్యాండ్లర్లు పనిచేస్తున్నట్లు తెలిపారు.భారత్‌లోని యువతను నేరుగా సంప్రదించకుండా సోషల్ మీడియా ద్వారా లక్ష్యంగా చేసుకుంటున్నారని అధికారులు వివరించారు. ముందుగా వ్యక్తుల ప్రొఫైల్స్‌ను గుర్తిస్తారు. ఆ తర్వాత పరిచయం పెంచుకొని నియామకం, మత ఛాందసవాదం వైపు మళ్లించడం, దాడులకు ప్రణాళిక రూపొందించడం జరుగుతున్నట్లు తెలిపారు.

**‘లోన్ వుల్ఫ్’ దాడులపై దృష్టి**

ఇలాంటి నెట్‌వర్క్‌ల ద్వారా ‘లోన్ వుల్ఫ్’ దాడులను ప్రోత్సహించాలని పాక్ ప్రయత్నిస్తున్నట్లు అధికారులు చెప్పారు. వీటికి పెద్ద మొత్తంలో డబ్బు, భారీ మాడ్యూల్స్ అవసరం ఉండవు. ఆన్‌లైన్‌లో ప్రభావితమైన వ్యక్తులు సొంతంగా దాడులకు పాల్పడే అవకాశం ఉంటుంది. దీంతో దాడి వెనుక అసలు కుట్రదారులను గుర్తించడం దర్యాప్తు సంస్థలకు కష్టమవుతుంది.పాక్ ఇలా వ్యూహం మార్చుకోవడానికి ‘ఆపరేషన్ సిందూర్’ ప్రధాన కారణమని అధికారులు తెలిపారు. మరోసారి అలాంటి ఆపరేషన్‌ను ఎదుర్కొనే పరిస్థితి పాకిస్థాన్‌కు లేదని పేర్కొన్నారు. ఆపరేషన్ సిందూర్ పాక్ ఉగ్ర మౌలిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీసిందని చెప్పారు. అంతర్జాతీయ సంస్థల ఒత్తిడి, ముఖ్యంగా ఎఫ్ఏటీఎఫ్ నిఘా కూడా పాక్ వ్యూహం మారడానికి మరో కారణమని తెలిపారు.

భవిష్యత్తులో భారత్‌పై జరిగే ఏ ఉగ్రదాడినైనా కేవలం సరిహద్దు దాటి జరిగిన ఉగ్ర చర్యగా చూడబోమని భారత్ ఇప్పటికే స్పష్టం చేసింది. దాన్ని తమపై జరిగిన యుద్ధ చర్యగా పరిగణిస్తామని ప్రకటించింది. దీంతో పాకిస్థాన్ తన ప్రమేయం బయటపడకుండా ‘డినయబిలిటీ’కి (తిరస్కరణవాదం) ప్రాధాన్యం ఇస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు.

## టీచర్ స్థానాన్ని మరో టీచర్‌తోనే భర్తీ చేయగలం

- మొదటి పేజి తరువాయి

నేర్చుకోవాలని, ఈ విషయంలో గురువుల పాత్ర ఎంతో కీలకమని వివరించారు.

గతంలో తాను సీఎంగా ఉన్నప్పుడు ఐటీ విప్లవానికి శ్రీకారం చుట్టానని, టెలికాం రంగంలో అప్పటి ప్రధాని వాజ్‌పేయి సహకారంతో కీలక సంస్కరణలు తీసుకొచ్చామని గుర్తుచేశారు. దాని ఫలితంగానే హైదరాబాద్ నాలెడ్జ్ ఎకానమీ హబ్‌గా మారిందని, ప్రపంచవ్యాప్తంగా తెలుగువారు సత్తా చాటుతున్నారని అన్నారు. అమెరికా, ఆసియా దేశాల అభివృద్ధికి జ్ఞానమే పునాది అని, రాబోయే 10–15 ఏళ్లలో భారత్ స్వరూపం పూర్తిగా మారిపోతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఒకప్పుడు సిద్ధాంతాలకు ప్రాధాన్యం ఉండగా, ఇప్పుడు పోటీతత్వం పెరిగి విలువలు తగ్గుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

## కొండా సురేఖ స్థానంలో ఎవరు?

కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించిన నేపథ్యంలో తెలంగాణ కేబినెట్ విస్తరణపై జోరుగా చర్చ జరుగుతోంది. ఈ క్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇవాళ మీడియాతో చిట్‌చాట్‌లో మాట్లాడిన ఆయన.. ప్రస్తుతం కేబినెట్ విస్తరణపై ఎలాంటి చర్చ జరగలేదని స్పష్టం చేశారు.ఇటీవల తాను ఢిల్లీ వెళ్లినప్పుడు మంత్రివర్గ విస్తరణ అంశం ప్రస్తావనకు రాలేదన్నారు. కొండా సురేఖ, చిన్నారెడ్డికి సంబంధించిన అంశాలపైనే అధిష్ఠానంతో చర్చ జరిగిందని తెలిపారు.కొండా సురేఖను మంత్రి వర్గం నుంచి తప్పించడం పూర్తిగా ఏఐసీసీ నిర్ణయమని మహేశ్‌కుమార్ గౌడ్ చెప్పారు. ఆమెపై చర్యలు తీసుకోకుండా ఆపేందుకు ప్రయత్నించినా.. ఏఐసీసీ ఈ విషయంలో సీరియస్‌గా ఉండటంతో నిర్ణయం జరిగిపోయిందన్నారు.

**ఇప్పట్లో విస్తరణ లేనట్లే!**

ప్రస్తుతం కేబినెట్ విస్తరణకు సంబంధించి హైకమాండ్ నుంచి తమకు ఎలాంటి సమాచారం లేదని పీసీసీ చీఫ్ తెలిపారు. రాష్ట్రంలో మంత్రివర్గాన్ని ఎప్పుడు విస్తరించాలనేది ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నిర్ణయిస్తారని స్పష్టం చేశారు.తనకు మంత్రి పదవి దక్కుతుందంటూ జరుగుతున్న ప్రచారంపైనా మహేశ్‌కుమార్ గౌడ్ స్పందించారు. ఈ వార్తలపై తనకు ఎలాంటి సమాచారం లేదని తేల్చిచెప్పారు. దీంతో కొండా సురేఖ స్థానంలో ఎవరికి అవకాశం దక్కుతుందన్న చర్చకు ఇప్పటికైతే స్పష్టత రాలేదు.

## మేం సిద్ధం.. స్థానిక పోరు నుంచి చంద్రబాబులా పారిపోం

- మొదటి పేజి తరువాయి

ఉంటుందన్నారు. స్థానిక పోరును ఎదుర్కొనేందుకు తమ పార్టీ అన్ని విధాలా సమరసన్నాహాలతో సిద్ధంగా ఉందని వెల్లడించారు.తెలుగుదేశం, జనసేన, బీజేపీలు కూటమిగా ఒక్కటైనప్పటికీ, స్థానిక ఎన్నికల్లో పోటీ చేసేందుకు వణుకుతున్నాయని అమర్‌నాథ్ ఎద్దేవా చేశారు. అధికార బలాన్ని ఉపయోగించి స్థానిక సమరాన్ని వాయిదా వేసేందుకు, ఎన్నికల నుంచి తప్పించుకునేందుకు కూటమి నేతలు దిగజారుడు యత్నాలు చేస్తున్నారని మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల విఫలంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి మొదలైందని, ఈ స్థానిక ఎన్నికల ఫలితాలతో తమ అసలు రంగు బయటపడుతుందనే భయంతోనే కూటమి నాయకులు జంకుతున్నారని ఆయన వ్యాఖ్యానించారు.

## కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్.. లష్కరే కమాండర్ హతం

జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదుల ఏరివేత ప్రక్రియ కొనసాగుతోంది. శనివారం మధ్య కశ్మీర్‌లోని బుద్గాం జిల్లాలో భద్రతా బలగాలకు, ఉగ్రవాదులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో పాకిస్థాన్‌కు చెందిన లష్కరే తోయిబా (ఎల్‌ఈటీ) కమాండర్ యాసిర్ హతమయ్యాడు. యూస్‌మార్గ్ అటవీ ప్రాంతంలో ఈ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది.యూస్‌మార్గ్ ప్రాంతంలో ఉగ్రవాదుల సంచారంపై నిఘా వర్గాల నుంచి అందిన కచ్చితమైన సమాచారంతో స్పెషల్ ఫోర్సెస్, 53 రాష్ట్రీయ రైఫిల్స్ దళాలు సంయుక్తంగా ‘కార్డన్ అండ్ సెర్చ్’ ఆపరేషన్ ప్రారంభించాయి. భద్రతా బలగాల రాకను గమనించిన ఉగ్రవాదులు కాల్పులకు తెగబడటంతో దళాలు ప్రతిదాడి చేశాయి. ఈ కాల్పుల్లో యాసిర్ అక్కడికక్కడే మృతి చెందినట్లు అధికారులు ధ్రువీకరించారు.యాసిర్ గతంలో లష్కరే తోయిబాలోని సులేమాన్ మూసా గ్రూప్‌లో సభ్యుడిగా ఉండేవాడని, అయితే సుమారు ఏడాది క్రితం ఆ విభాగం నుంచి విడిపోయి సొంతంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్నట్లు భద్రతా వర్గాలు వెల్లడించాయి. గత కొంతకాలంగా యూస్‌మార్గ్ పరిసర ప్రాంతాల్లో అతడి కదలికలపై నిఘా ఉంచినట్లు అధికారులు తెలిపారు.

యాసిర్ మృతి నేపథ్యంలో అతడి నెట్‌వర్క్, లష్కరే సభ్యులతో ఉన్న సంబంధాలు, అలాగే ఇటీవల జమ్ము కశ్మీర్‌లో జరిగిన ఉగ్ర దాడుల్లో అతడి ప్రమేయంపై దర్యాప్తు సంస్థలు విచారణ జరుపుతున్నాయి. కాగా, 2025 పహల్గాం ఉగ్రదాడికి సూత్రధారి అయిన సులేమాన్ మూసాను గతంలోనే భద్రతా బలగాలు హతమార్చిన సంగతి తెలిసిందే. కశ్మీర్‌లో ఉగ్రవాద నిర్మూలనకు చేపట్టిన ఆపరేషన్లలో యాసిర్ ఎన్‌కౌంటర్ కీలక విజయమని అధికారులు పేర్కొన్నారు.

## ఇక రాజకీయాల నుంచి తప్పుకుంటా.. వచ్చే ఎన్నికల్లో పోటీ చేయను

- మొదటి పేజి తరువాయి

అసెంబ్లీ స్పీకర్‌గా తనకు మిగిలి ఉన్న మూడేళ్ల పదవీకాలంలో నియోజకవర్గంలో పనులు, అభివృద్ధి కార్యక్రమాలు పూర్తి చేయడానికి ప్రాధాన్యమిస్తానని ప్రకటించారు. గత 31 ఏళ్లుగా తన పుట్టినరోజు సందర్భంగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించే సాంప్రదాయాన్ని కొనసాగిస్తున్నామన్నారు.మరోవైపు, రేపు (సెప్టెంబరు 6) నర్సీపట్నంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, ఎంపీ చింతకాయల విజయ్ ఆధ్వర్యంలో ‘బీసీ ఐక్య వేదిక సదస్సు’ నిర్వహించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు కూటమి ప్రభుత్వం 34 శాతం రిజర్వేషన్లు కల్పించి విద్య, ఉద్యోగాల్లో ప్రాధాన్యం ఇస్తుంటే, వైసీపీ మాత్రం బీసీల హక్కులపై రాజకీయం చేస్తూ కుట్రలు పన్నుతోందని టీడీపీ నేతలు మండిపడ్డారు. వైసీపీ కుట్రలను తిప్పికొట్టేందుకు బీసీ వర్గాలన్నీ ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.

## ఘనంగా పోసిన శ్రీకృష్ణ దేవరాయలు జన్మదిన వేడుకలు

**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 5:**అన్నదేవరపేట గ్రామంలో సీనియర్ నాయకులు, మాజీ సొసైటీ అధ్యక్షులు పోసిన శ్రీకృష్ణ దేవరాయలు జన్మదిన వేడుకలు శుక్రవారం రాత్రి బంధువులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానుల మధ్య అత్యంత ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు శ్రీకృష్ణ దేవరాయలకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వేడుకల్లో భాగంగా కేక్ కట్ చేసి సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండలంలోని పలువురు నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున హాజరై వేడుకలను విజయవంతం చేశారు.






## పోలవరం జిల్లాలో పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు

- ప్రకృతి అందాలను ఆస్వాదించేలా మౌలిక వసతుల కల్పన
- పర్యాటకుల భద్రత, పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి:
- కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 5 :** పోలవరం జిల్లాలోని ప్రకృతి అందాలతో అలరారే పర్యటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసి, దేశీయ, విదేశీ పర్యాటకులను ఆకర్షించేలా అవసరమైన చర్యలు చేపట్టనున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. శనివారం రంపచోడవరంలోని స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో టూరిజం శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలోని పర్యటక ప్రాంతాల అభివృద్ధి, పర్యాటకులకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, పరిశుభ్రత, భద్రత తదితర అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కె. దినేష్ కుమార్ మాట్లాడుతూ పోలవరం జిల్లాలో ప్రకృతి అందాలతో అలరారుతున్న పర్యటక ప్రాంతాలను పర్యాటకులను విశేషంగా ఆకర్షించే విధంగా అభివృద్ధి చేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక రంగం అభివృద్ధి చెందడం ద్వారా స్థానిక ప్రాంతాల అభివృద్ధితో పాటు ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయని పేర్కొన్నారు.

**పరిశుభ్రతకు ప్రాధాన్యం**

పర్యటక ప్రాంతాల్లో పరిశుభ్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని కలెక్టర్ సూచించారు. పర్యాటకులు ఎక్కడపడితే అక్కడ చెత్త వేయకుండా అవసరమైన ప్రదేశాల్లో తగిన సంఖ్యలో చెత్తకుండీలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల పరిసరాలను



ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు.

**జలపాతాల వద్ద ప్రత్యేక భద్రత**

ప్రమాదకరమైన జలపాతాలు, వాటర్‌ఫాల్స్ ప్రాంతాల్లో పర్యాటకుల భద్రతకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి అక్కడ స్పష్టంగా కనిపించే విధంగా హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. జలపాతాలు, నీటి ప్రవాహాలు అధికంగా ఉండే ప్రాంతాల్లో పర్యాటకులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నిషేధిత ప్రాంతాల్లోకి వెళ్లకూడదనే సూచనలను హెచ్చరిక బోర్డుల ద్వారా తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. పర్యాటకుల ప్రాణ భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని పేర్కొన్నారు.

**మెరుగైన పర్యాటక అనుభూతికి చర్యలు**

పర్యటక ప్రాంతాలకు వచ్చే సందర్శకులకు మెరుగైన అనుభూతి కలిగేలా అవసరమైన మౌలిక వసతులను అభివృద్ధి చేయాలని కలెక్టర్ సూచించారు. పరిశుభ్రమైన వాతావరణం, పర్యాటకులకు అవసరమైన సదుపాయాలు, పటిష్టమైన భద్రతా ప్రమాణాలు కల్పించడం ద్వారా జిల్లాలో పర్యాటక రంగాన్ని మరింత అభివృద్ధి చేయాలని పేర్కొన్నారు. ఈ సమీక్ష సమావేశంలో టూరిజం రీజినల్ డైరెక్టర్ ఎన్.వి.వి.ఎస్. మూర్తి, జిల్లా టూరిజం అధికారి జి. దాసు, కన్సల్టెంట్ వంశీ తదితరులు పాల్గొన్నారు.



## మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా మాదిరి అలీషా రాణి

**ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో ఘన సన్మానం**

గంగవరం /రాజవొమ్మంగి, పెన్ పవర్, సెప్టెంబర్ 5:పోలవరం జిల్లా రాజవొమ్మంగి మండలంలోని ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్న మాదిరి అలీషా రాణి మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా అవార్డుకు ఎంపికై, అవార్డును అందుకున్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజవొమ్మంగి మండల ఉపాధ్యాయ సమాఖ్య ఆధ్వర్యంలో రాజవొమ్మంగి మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆమెకు మండల ఉత్తమ ఉపాధ్యాయురాలి అవార్డును ప్రదానం చేసి ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి-1 కారం సత్యనారాయణ దొర, మండల విద్యాశాఖ అధికారి-2 టీ. సూరయ్య రెడ్డి, మండల పరిషత్ అధ్యక్షురాలు గోము వెంకటలక్ష్మి తదితరులు పాల్గొని అలీషా రాణిని అభినందించారు. ఈ సందర్భంగా అలీషా రాణి మాట్లాడుతూ.. మండల ఉత్తమ ఉపాధ్యాయురాలిగా లభించిన ఈ అవార్డు తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ఈ అవార్డు తనపై మరింత బాధ్యతను పెంచిందని, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు మరింత అంకితభావంతో పనిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సమాఖ్య నాయకులు పాల్గొన్నారు.



## సెయింట్ లూక్స్ స్కూల్లో ఘనంగా గురుపూజోత్సవం

**తాళ్లపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 5:**డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా ప్రక్కిలంకలోని సెయింట్ లూక్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో డా.సర్వేపల్లి చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలియచేస్తూ, కేక్ కట్ చేశారు. పాఠశాల కరస్పాండెంట్ సుబ్రహ్మణ్యం సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. పాఠశాల అధ్యాపక బృందం ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గోవిందగిరి వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధిపై కలెక్టర్‌తో టీటీడీ అర్చకుల చర్చ



- భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై చర్చ
- ఆలయ అభివృద్ధికి సానుకూలంగా స్పందించిన కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 5:** పోలవరం జిల్లాలో ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యం కలిగిన టీటీడీ గోవిందగిరి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పన తదితర అంశాలపై జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్‌తో ఆలయ అర్చకులు చర్చించారు. శనివారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయంలోని ఛాంబర్‌లో జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్‌ను టీటీడీ గోవిందగిరి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ అర్చకులు దీవి పార్థు స్వామి, గోవర్ధనం మణికంఠ స్వామి, ఆలయ ఇన్‌స్పెక్టర్ అంచూరి శిరీష మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రస్తుత పరిస్థితి, ఆలయ అభివృద్ధికి అవసరమైన చర్యలు, భక్తులకు అందుబాటులోకి తీసుకురావాల్సిన సౌకర్యాలు తదితర అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. ఆలయానికి వచ్చే భక్తులకు మరింత ఆహ్లాదకరమైన, ఆధ్యాత్మిక వాతావరణం కల్పించేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. అలాగే ఆలయ పరిసరాల అభివృద్ధి, అవసరమైన మౌలిక సదుపాయాల మెరుగుదల, భక్తుల సౌకర్యార్థం చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై కూడా కలెక్టర్‌తో వివరంగా చర్చించారు. ఆలయానికి ఉన్న ఆధ్యాత్మిక, పర్యాటక ప్రాధాన్యతను దృష్టిలో ఉంచుకుని అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాల్సిన అవసరాన్ని అర్చకులు కలెక్టర్‌కు వివరించారు. టీటీడీ గోవిందగిరి శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆలయ అభివృద్ధికి సంబంధించిన అంశాలపై జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ సానుకూలంగా స్పందించినట్లు ఆలయ ప్రతినిధులు తెలిపారు. అనంతరం ఆలయ అర్చకులు శ్రీ వేంకటేశ్వర స్వామివారి ఆశీర్వచనాన్ని కలెక్టర్‌కు అందజేసి, స్వామివారి తీర్థ ప్రసాదాలను సమర్పించారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసిఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ప్రత్యేక పంచాయతీ ఏర్పాటు చేయాలి.. పరిహారం వచ్చినందుకు కృతజ్ఞతలు ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరిని కలిసిన కూటమి నాయకులు



**సీతానగరం, పెన్ పవర్, సెప్టెంబర్: 05**భారత జనతా పార్టీ సీనియర్ నాయకులు ఏపీ ఆర్ చౌదరి ఆధ్వర్యంలో కూటమి నాయకులు శనివారం కలిశారు. రామచంద్రపురం గ్రామంలో ప్రత్యేక పంచాయతీ చేయాలంటూ ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, కలిసిన అనంతరం తూర్పు గోదావరి జిల్లా రాజనగరం నియోజకవర్గంసీతానగరం మండలంలోని ఏటిపట్టు అయిన రెండు గ్రామాలు రామచంద్రపురం పురుషోత్తపట్నం ఒకే పంచాయతీగా ఉండడంతో దీనిని రెండు పంచాయతీలుగా చేయాలంటూ మరియు పోలవరం ప్రాజెక్టు ఎడమ ప్రధాన కాలువ పరిధిలో రూపుదిద్దుకున్న పురుషోత్తపట్నం ఎత్తిపోతల పథకం వల్ల భూములు కోల్పోయిన రైతులకు, నిరుపేద నిర్వాసితులకుఎట్టకేలకు న్యాయం చేకూరిందని. నష్టపరిహారంతో పాటు చట్టబద్ధమైన వడ్డీ బకాయిలను రైతులకు చెల్లించేందుకు కూటమి ప్రభుత్వం రూ. 32,10,20,150/- లను విడుదల చేస్తూ పరిపాలనా అనుమతులు మంజూరు చేసిందని రామచంద్రపురం పురుషోత్తపట్నం రైతులు తెలిపారు. రైతులకు ఎంపీ దగ్గుపాటి పురందేశ్వరి, రాజానగరం నియోజకవర్గం టిడిపి ఇన్చార్జ్ మరియు రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి, నియోజకవర్గ ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ, నిరంతరం శ్రమించి నిర్వాహితుల ఆవేదనను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, నీటి పారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు దృష్టికి తీసుకువెళ్లడం రైతులకు నష్టపరిహారం అందడంతో హర్ష వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు గద్దె వెంకటకృష్ణ చౌదరి ( నళి), మండా రాంబాబు, షేక్ మీరా షరీఫ్ రాజు, గుర్రం ఉదయ్, దొరాజి, సీతానగరం మండల బిజెపి అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# నిత్యవసర వస్తువుల ధరల పెంచడమే సంపద సృష్టించడమా....

**రాష్ట్ర మాదిగ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కండెల్లి పెద్దిరాజు.**

**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 05:**–సంపద సృష్టించడం అంటే నిత్యావసర వస్తువుల ధరలు పెంచి పేదల నడ్డివిరవడమేనా అంటూ వైసిపి రాష్ట్ర నాయకుడు కండెల్ల పెద్దిరాజు ఆగ్రహం వ్యక్తం చేసారు గోకవరం మండలంలోని ఆయన స్వగ్రామమైన గుమ్మడిదొడ్డి నుండి మీడియాకు ఓటు ప్రకటన విడుదల చేశారు వై యస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పెన్షనర్స్ రిటైర్డ్ ఉద్యోగుల కార్యాదర్శి మరియు మాజీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాదిగ వెల్ఫేర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ కండెల్ల పెద్దిరాజు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎంతసేపు వారి స్వంత డబ్బాలు కొట్టుకుంటూ గత వై సి పి ప్రభుత్వంలో పూర్తి చేసిన ప్రాజెక్టులను నేడు వారే పూర్తిచేసినట్టుగా ప్రారంభోత్సవాలకు, ఫోటోలకు ప్రాధాన్యతను ఇస్తూ ప్రజలకు చేసిందేమిలేదని,బూటకపు హామీలతో గద్దెనెక్కి రేవు దాటిన తరువాత తెప్ప తగలలేసి నట్టుందని ఆయన ఎద్దేవా చేసారు. ఎన్నికలకు ముందు చంద్రబాబు తన ఎన్నికల ప్రచారంలో నిత్యావసర వస్తువులకు రెక్కలొచ్చాయని కూటమి అధికారంలోకి వచ్చినవెంటనే రెక్కలు కత్తిరిస్తానని చంద్రబాబు ప్రజలకు హామీ ఇవ్వడం జరిగిందని, ధరల రెక్కలు కత్తిరించడం అంటుంచితే నాటి ధరలకు ఇప్పటి కూటమి ధరలు మూడింతలు పెంచి మాట తప్పిన ఘనత కూటమి దేనని ఆనాడు వై యస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం లో నిత్యావసర వస్తువుల ధరలను స్టిరీకరించి, కోవిడ్ సమయంలో



కూడా ప్రజలకు ఇబ్బంది లేకుండా చూసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి వర్యులు వై యస్ జగన్మోహన్ రెడ్డి గారికే దక్కిందని, చంద్రబాబు ప్రజలపై నిత్యావసర వస్తువుల భారం పెంచి పేద, బడుగు, బలహీన వర్గాల నడ్డి విరిచి పరిపాలనను అదోగతి పాలు చేసారని జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వంలో కేజీ బియ్యం 42 రూ. ఉండగా నేడు 79 రూ.నాడు కేజీ పామాయిలు 79 రూ. ఉండగా నేడు 135 కు, నాడు పంచదార కేజీ 38 రూ. ఉండగా నేడు 76 రూ. కు,నాడు ఉల్లిపాయలు కేజీ 14 రూపాయలు ఉండగా నేడు 62 రూ. కు, నాడు కంది పప్పు 89 రూ. ఉండగా నేడు 162 రూ. కు ఇలా ప్రతీ వస్తువు ధరను పెంచేస్తూ ధరలు స్టిరీకరణ చేయడం లో పూర్తిగా కూటమి ప్రభుత్వం విఫలమైయిందని, సగటున మనిషి మార్కెట్టులో కొనుగోలు శక్తి తగ్గి రూపాయి విలువను పతనం చేసే స్థాయిలోకి తీసుకొచ్చేశారని, ఇచ్చిన హామీలను తుంగలోకి త్రోక్కి, సంక్షేమాన్ని పూర్తిగా మరిచారని ప్రజలను పట్టించుకోకుండా గాలి కొదిలేచారని ప్రజలు అన్నీ గమనిస్తున్నారని త్వరలో ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికలలో సరైన బుద్ధి చెబుతారని, ప్రజా వ్యతిరేకత మొదలైందని, ప్రజాగ్రహానికి కూటమి ప్రభుత్వం గురికాక తప్పదని ఆయన హెచ్చరించారు. డి యస్సి నియామకాలలో లోపాలు ఒక్కొక్కటిగా బయట పడుతున్నాయని ప్రజలకు సమాధానం చెప్పవలసిన బాధ్యత కూటమి దేనని, అదేవిదంగా ఉద్యోగులను నిలువునా నమ్మించి మోషం చేసిందని 11 వ పే కమీషన్ ఇవ్వకపోగా, 12 వ పే కమీషన్ అమలు చేసే మాట అస్సలే లేదని, యువతకు ప్రోత్సాహక భృతి మాట మరచి యువతకు మొండి చెయ్యి చూపారని ఇది దగా కోరు ప్రభుత్వమని తొందర్లో కూటమికి పాడే కట్టే రోజు దగ్గర పడిందని ఆయన కూటమి ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

## స్వర్ణ భారతి హైస్కూల్లో ఉపాధ్యాయ దినోత్సవం





**కొవ్వూరు, పెన్ పవర్, సెప్టెంబర్ 5:**ధర్మవరంలోని స్వర్ణ భారతి ఇంగ్లీష్ మీడియం హై స్కూల్ నందు కృష్ణాష్టమి, ఉపాధ్యాయదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కరస్పాండెంట్ పేరిచర్ల రామకృష్ణ రాజు, ప్రిన్సిపాల్ పద్మ ఆధ్వర్యంలో విద్యార్థులచే ఉట్టి కొట్టడం అనే కార్యక్రమమును నిర్వహించడం జరిగింది. శ్రీకృష్ణ, గోపికల వేషధారణ కలిగిన చిన్నారుల వస్త్రాలంకరణ అందరినీ ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా శ్రీకృష్ణుని యొక్క ప్రాముఖ్యతను కరస్పాండెంట్ పేరిచర్ల రామకృష్ణ రాజు విద్యార్థులకు వివరించడం జరిగింది. అదేవిధంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని పాఠశాల కరస్పాండెంట్ పేరిచర్ల రామకృష్ణ రాజు, ప్రిన్సిపల్ పద్మ పాఠశాలలో పనిచేస్తున్న ప్రతి ఒక్క ఉపాధ్యాయనీ, ఉపాధ్యాయులను దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలు విద్యార్థుల జీవితంలో ఎంత ప్రముఖ పాత్రను తెలియజేశారు. అనంతరం విద్యార్థులకు ఉపాధ్యాయ దినోత్సవ విశిష్టతను వివరించడంతో పాటు, భారతదేశ మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవితం, విద్యారంగానికి ఆయన అందించిన విశిష్ట సేవలు, దేశ నిర్మాణంలో ఉపాధ్యాయుల ప్రాముఖ్యత గురించి వివరించారు. గురువులను గౌరవించడం, వారి మార్గదర్శకత్వాన్ని సద్వినియోగం చేసుకోవడం ద్వారా విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు.

## మదర్ తెరిసా ఆదర్శం




**జీలుగుమిల్లి, పెన్ పవర్, సెప్టెంబర్ 5;** తోటి వారి పట్ల ప్రేమ ,దయాగుణం కలిగి ఉండి మదర్ తెరిసా ఆమె సేవలను స్ఫూర్తిగా ఆదర్శంగా తీసుకోవాలని జీలుగుమిల్లి ప్రభుత్వ ఆసుపత్రి హెల్త్ అసిస్టెంట్ కురం ప్రసాదు అన్నారు. శనివారం మదర్ తెరిసా వర్ధంతి సందర్భంగా తెలంగాణ రాష్ట్రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వరావుపేట లో ఉన్న సేవాసదనం ఆశ్రమ నిర్వాహకుల కోరిక మేరకు స్టీల్ గ్యాస్ స్టవ్ మరియు స్టీల్ గిన్నెలను, బేసిళ్లను అందించడం జరిగిందని తెలిపారు. తన కుమార్తెల పుట్టినరోజు సందర్భంగా గతంలో జంగారెడ్డిగూడెం లోని అనాధ ఆశ్రమలకు కూడా తన వంతు సహాయంగా నిత్యవసర సరుకులు పంపిణీ చేయడం జరిగింది .ఎవరికైనా సహాయం చేయాలి అంటే నేను ఉన్న అంటూ కురం ప్రసాదు ముందు ఉంటాడు అని పలువురు ప్రశంసిస్తుంటారు. వృద్ధాశ్రమకు తన వంతు సహాయం చేసినందుకు ఆశ్రమ నిర్వాహకులు కురం ప్రసాదని భవిష్యత్తులో మరింత మందికి సేవ చేయాలని దేవుడు చల్లగా చూడాలని దీవించారు.

## ప్రధాన రహదారులు దిగ్బంధం చేస్తే చర్యలు తప్పవు.. ఎస్సై ఎల్. శ్రీను నాయక్



**సీతానగరం, పెన్ పవర్, సెప్టెంబర్:05**:సీతానగరం నుండి రాజమహేంద్రవరం వెళ్లే ఆర్ అండ్ బి ప్రధాన రహదారిపై ఎటువంటి అనుమతులు లేకుండా రోడ్డుపై నే ప్రైవేటు కార్యక్రమాలు చేసిన వారిపై చట్టపరమైన చర్య లు తీసుకుంటామని సీతానగరం, ఎస్సై ఎల్. శ్రీను నాయక్ స్పష్టం చేశారు. శనివారం తమ సిబ్బందితో కలిసి రోడ్డు ప్రక్కనే ఇసుక రాళ్లు ఇనుము ఇటుక టెంట్ సామాగ్రిని గుట్టలుగా ఉంచిన వారిపై గ్రామపంచాయతీల ద్వారా నోటీసులు జారీ చేశారు. నాలుగు లైన్ల ఈ రహదారి ఇష్టారాజ్యంగా కొంతమంది ఉపయోగించుకోవడం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. రోడ్డుపై దిగ్బంధం చేసి శిబిరాలు భోజనాలు నిర్వహించడం వల్ల ప్రమాదాలకు నిలయంగా మారిందన్నారు. అదేవిధంగా సీతానగరం నుండి రాజమహేంద్రవరం వరకు రోడ్లు బ్లాక్ చేస్తే వారిపై కేసులు నమోదు చేయడం జరుగుతుందని ఎస్సై ఎల్. శ్రీను నాయక్ తెలిపారు. నోటీసులు తీసుకున్న వారంతా ఆయా గ్రామాల్లో సామాగ్రి పెట్టిన వారందరికీ ఇప్పటికే పోలీస్ సిబ్బందితో సమాచారం అందించామని తెలిపారు.

## జువ్విగూడెంలో ఘనంగా పుస్తక నిక్షిప్త కేంద్రం ప్రారంభోత్సవం



**చింతూరు, పెన్ పవర్ సెప్టెంబర్ 5:**జువ్విగూడెం గ్రామంలో పుస్తక నిక్షిప్త కేంద్రం ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చింతూరు ఐటీడీఏ పీఓ శుభం నొక్వాల్, జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ మొహమ్మద్ జమాల్ ఖాన్ హాజరై రిబ్బన్ కట్ చేసి కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా పుస్తక నిక్షిప్త కేంద్రం అభివృద్ధి కోసం ఐటీడీఏ పీఓ శుభం నొక్వాల్ రూ.20,000 విలువైన చెక్కును అందజేశారు. అలాగే జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పుస్తక నిక్షిప్త కేంద్రం పక్కనే ఉన్న పాఠశాల చుట్టూ రూ.12,500 వ్యయంతో ఫెన్సింగ్ ఏర్పాటు చేశారు. అనంతరం పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు, యువత మొక్కలను సంరక్షిస్తూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని నిర్వాహకులు సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు, యువతకు పుస్తకాలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా వారిలో పఠనాసక్తిని పెంపొందించవచ్చని ముఖ్య అతిథులు పేర్కొన్నారు. పుస్తక నిక్షిప్త కేంద్రాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకుని జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చింతూరు గ్రంథాలయ కమిటీ అధ్యక్షులు షేక్ రియాజ్, లైబ్రేరియన్ మంగేటి గంధరాజులు, ఎంపీడీవో శ్రీనివాస్ దొర, వీఆర్‌పురం సబ్‌స్టాఫ్ సత్యారపు నాగరాజు, కుంజా శ్రీను, కుంజా బాలకృష్ణ, బొక్కిలి రాంబాబు, పసుపులేటి సల్మాన్ రాజు, జనసేన నాయకులు ముర్రం నాగయ్య, కుంజా రమేష్, కుంజా ఎసుబాబు, ముర్రం రాజు, ముర్రం అర్జున్, మడకం నరేష్, కారం వినోద్ కార్యక్రమంలో పాల్గొని పుస్తక నిక్షిప్త కేంద్రం ఏర్పాటును అభినందించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులకు విద్య, పఠన వాతావరణాన్ని కల్పించేందుకు ఇలాంటి కార్యక్రమాలు మరిన్ని చేపట్టాలని వారు ఆకాంక్షించారు.



## అంగన్వాడీ అంటే ఇలా ఉండాలి! పిల్లలను ఆడిస్తున్నరు కార్యకర్త మైథిలి.






**గోకవరం పెన్ పవర్ సెప్టెంబర్ 05:**–తూర్పుగోదావరి జిల్లా గోకవరం మండలం రంప ఎర్రం పాలెం గ్రామంలో అంగన్వాడీ కేంద్రంలో కార్యాకర్త పిల్లలకు ఆటపాటల తో విద్యాబోధన చేస్తూ, కేంద్రాన్ని చక్కగా నిర్వహిస్తున్నరు.అంగన్వాడీ అంటే ఇలా ఉండాలి! పిల్లలతో ఆటపాటలు ఆడిస్తున్నరు కార్యకర్త మైథిలి.

కోరుకోండ ఐ సి డి ఎస్ పరిధిలోని గోకవరం మండలం రంపయర్రంపాలెం గ్రామం లోని జిల్లాపరిషత్ హైస్కూల్ సమీపంలో ఉన్న అంగన్వాడీ సెంటర్లోని కార్యకర్త బత్తిన చిరంజీవి మైథిలి కేవలం తన ఆటపాటలతో చిన్నారులను ఆహ్వానింపచేస్తూ ఆటలాడించడం చిన్నారుల తల్లిదండ్రులను ఆకర్షింపజేసింది. కేంద్రాన్ని పరిశుభ్రంగా, రంగురంగుల బొమ్మలతో, అక్షరాలతో అందంగా తీర్చిదిద్దారు.

పిల్లలకు అక్షరాభ్యాసం, లెక్కలు, ఆటలతో పాటు మంచి అలవాట్లు కూడా నేర్పిస్తున్నారు. దీంతో తల్లిదండ్రులు కూడా సంతోషంగా తమ పిల్లలను అంగన్వాడీకి పంపిస్తున్నారు.

## ఉత్తమ ఉపాధ్యాయురాలు మల్లమ్మ దేవి ని సన్మానించిన జిల్లా కలెక్టర్



**వై. రామవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 5:**మండలం లో దాలిపాడు ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాల లో సోషల్ టీచర్ గా పని చేస్తున్న శ్రీమతి రేవుల మల్లమ్మ దేవి ని పోలవరం జిల్లా కలెక్టర్ కె దినేష్ కుమార్ టీచర్స్ డే సందర్భంగా ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానించడం జరిగిందని ఎంఈఓ2 జోగేశ్వరరావు తెలిపారు.

మండలంలో ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు, ముగ్గురు ఎస్జీటీలు ఉత్తమ ఉపాధ్యాయులయ ఎంపికయ్యారని తెలిపారు. వీరందరిని శనివారం కే దినేష్ కుమార్ శాలువ, పూల దండలతో సన్మానించారని తెలిపారు. దాలిపాడు ఆశ్రమ ఉన్నత బాలికల పాఠశాల నుండి ఉత్తమ ఉపాధ్యాయులు రాలిగా ఎంపిక కావడం శుభదాయకమని తోటి ఉపాధ్యాయులు కొనియాడారు.

## బయ్యవరం భూములను పరిశీలించిన ఎమ్మెల్యే, ఆర్డీఓ



**తాళ్ళపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 5:**తాళ్లపూడి మండలంలోని తాడిపూడి, బయ్యవరం గ్రామాల పరిధిలో ఉన్న పొలాలను పరిశ్రమల ఏర్పాటుకు అనువైన ప్రదేశంగా గుర్తించేందుకు కొవ్వూరు నియోజకవర్గ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, కొవ్వూరు ఆర్డీఓ కె.ఆనందరావు శుక్రవారం సంయుక్తంగా స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి కూటమి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. తాడిపూడి, బయ్యవరం గ్రామాల పరిధిలో ఉన్న భూముల్లో పరిశ్రమలు ఏర్పాటైతే స్థానిక యువతకు పెద్ద ఎత్తున ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఈ ప్రాంతం ఆర్థికంగా అభివృద్ధి చెందుతుందని, రైతులకు కూడా మేలు జరుగుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ లక్ష్మీ లావణ్య, తాడిపూడి సొసైటీ అధ్యక్షులు నామా కొండబాబు, అనపర్తి ప్రసాద్, సర్వేయర్, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు క్విజ్,వ్యాసరచన పోటీలలో బహుమతులుఅందజేత




**వి.ఆర్.పురం పెన్.పవర్.సెప్టెంబర్.5**విద్యార్థులకుక్విజ్,వ్యాసరచనపోటీలలోబహుమతులుఅందజేసిన,ప్రధానోపాధ్యాయులువెంక టరమణ,మండలంలోని వడ్డిగూడెం ఎం.పి.యు. పి.ఎస్.పాఠశాలోశనివారంప్రధానోపాధ్యాయులు వెంకటరమణ,ఉపాద్యాయులు,పాఠశాలవిద్యార్థు లుఆద్వర్యంలోభారతరత్నడాక్టర్ సర్వేపల్లిరాధాకృ ష్ణన్,చిత్రపటానికి,పూలమాలవేసిఘనంగా నివాళు లర్పించి,గురుపూజోత్సవ,వేడుకలనుఘనంగా నిర్వ హించడంజరిగింది. ఈవేడుకల్లోబాగంగా సెల్ఫ్,టీచింగ్, కార్యక్రమంఅందరినీ, ఆకట్టుకుంది. విద్యార్థినులుచీరలు, పంచెలుధరించి,ఉపాధ్యాయులుగా బ్లాక్ బోర్డుపై పాఠాలురాస్తూ,బోధించుతూతోటివిద్యార్థులను ఉత్సాహంగాపరిచారు. చిన్నారులుఉపాధ్యాయుల మాదిరిగానే,హావభావాలుపలుకుతూ గుడ్ మార్నింగ్,స్టూడెంట్స్,అంటూతరగతినిప్రారంభించిన, తీరుఅక్కడున్నవారిని, ఆనందపరిచింది.గణితం, తెలుగు,సైన్స్,పాఠాలనుతమదైనశైలిలోబోధించారు.ఈసందర్భంగాప్రధానోపాధ్యాయులువెంకటర మణమాట్లాడుతూవిద్యార్థుల లోదాగిఉన్న నాయ కత్వలక్షణాలను,బోధనానైపుణ్యాలను వెలికితీయ డమే,ఈ కార్యక్రమం ముఖ్యఉద్దేశమని,నేటివిద్యార్థు లే,రేపటిఉత్తమగురువులు అనిఅన్నారు.అనంతరం విద్యార్థులకు క్విజ్,వ్యాసరచనపోటీలునిర్వహించి, విద్యార్థులకుబహుమతులుఅందజేశా రు.ఈ కార్య క్రమంలోఉపాధ్యాయులు రవి,కామేశ్వరరావు,వెంకట రాజు,బాలకృష్ణ,ఉమాదేవి,అనూష,తదితరులువిద్యార్థులుపాఠశాలసిబ్బంది.తదితరులుపాల్గొన్నారు.

# ఇన్నీసుపేట బ్యాంకు చైర్మన్ కోళ్ల బాబును పదవి నుంచి తప్పించాలి

- ఆర్‌బిఐ నిబంధనలు విస్మరించి డిపాజిటర్ల సొమ్ము దుర్వినియోగం
- మాజీ ఎంపీ మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో వైసిపి శ్రేణుల ధర్నా




**రాజమహేంద్రవరం , పెన్ పవర్ సెప్టెంబర్ 5 :**రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నిబంధనలకు విరుద్ధంగా పదవిలో కొనసాగుతున్న ది ఇన్నీసుపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ పదవి నుంచి కోళ్ల అచ్యుత రామారావు (బాబు)ను తప్పించాలని మాజీ ఎంపీ, వైసిపి జాతీయ అధికార ప్రతినిధి, సిటీ ఇన్‌చార్జ్ మార్గాని భరత్ రామ్ డిమాండ్ చేసారు. నగరంలో నిబంధనలకు విరుద్ధంగా చిట్స్, వడ్డీ వ్యాపారాలు చేసే వారు ఆర్యాపురం, ఇన్నీసుపేట, జాంపేట బ్యాంకుల్లో చైర్మన్లు, డైరెక్టర్లుగా కొనసాగుతున్నారని, బ్యాంకులో ప్రజల డిపాజిట్లను దుర్వినియోగం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేసారు. స్థానిక శ్యామలా సెంటర్ వద్ద ఉన్న ఇన్నీసుపేట కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ వద్ద మార్గాని భరత్ రామ్ ఆధ్వర్యంలో వైసిపి శ్రేణులు శనివారం ధర్నా నిర్వహించాయి. 2025 పార్లమెంట్ చట్టం ప్రకారం కో ఆపరేటివ్ రంగంలో 10 సంవత్సరాల పదవీ కాలం పూర్తి చేసుకున్న చైర్మన్, డైరెక్టర్లు పదవులకు అనర్హులన్నారు. రిజర్వ్ బ్యాంక్ ఉత్తర్వులు జారీచేసి 13 నెలలు కావస్తున్నా ఇంతవరకు అనర్హులను పదవుల నుంచి తప్పించకపోవడం దారుణమన్నారు. సహకార శాఖ అధికారులను బాధ్యులుగా చేయాలని తాము హైకోర్టుని ఆశ్రయిస్తామని, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయిస్తామని హెచ్చరించారు. ఇన్నీసుపేట బ్యాంకులో చైర్మన్ కోళ్ల బాబుతో పాటు జామి వెంకట రమణమూర్తి, ఆదిరెడ్డి శ్రీనివాసరావు, కటారి శ్రీనివాస కన్నా, పంచకట్ల శివను తొలగించకపోతే తాము ఉద్యమిస్తామని స్పష్టం చేసారు. ఇన్నీసుపేట బ్యాంక్ చైర్మన్‌గా కోళ్ల బాబు గత 27 సంవత్సరాలుగా ఏకచత్రాదిపత్యం చెలాయిస్తున్నారని ఆరోపించారు. ఇన్నీసుపేట, ఆర్యాపురం బ్యాంకు చైర్మన్‌లు ఈవిఎం ఎమ్మెల్యేకు బంధువులని తెలిపారు. వారూ చిట్స్, వడ్డీ వ్యాపారం చేస్తున్నారని నిబంధనలకు విరుద్ధమని తేల్చి చెప్పారు. ఆర్యా పురం బ్యాంక్ చైర్మన్‌పై 51 విచారణ జరుగుతోందని, ఇన్నీసుపేట బ్యాంక్ చైర్మన్ కోళ్ల బాబు చేసిన అక్రమాలపై సమగ్ర విచారణ చేసి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు. ఈ బ్యాంకుల్లో ప్రజల డిపాజిట్ల పాలకవర్గాలు వాటితో సొంత వ్యాపారాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ బ్యాంకుల అక్రమాలను సహించేదీ లేదని, పెద్ద ఎత్తున ఉద్యమం చేసి అవినీతి వ్యవహారాలకు అడ్డుకట్ట వేస్తామన్నారు. అనంతరం బ్యాంక్ సిఇఓకు రిజర్వ్ బ్యాంక్ జారీచేసిన ఉత్తర్వుల కాపీలను, వినతి పత్రం అందచేసారు. ఈ కార్యక్రమంలో బ్యాంక్ డైరెక్టర్లు గుత్తుల భాస్కర్, అందనాపల్లి సత్యనారా యణ, మాజీ డైరెక్టర్ యజ్జరపు మరిడయ్య, వైసిపి నాయకులు, రొక్కం త్రినాథ్, బిల్డర్ చిన్నా, నల్లా రామాంజనేయులు, తిరగటి దుర్గ, సేపేని మునీశ్వరరావు, యజ్జవరపు శ్రీను, దుర్వాసుల సత్యనారాయణ, ముప్పన శ్రీను, కొల్లి నాని, రాజశేఖర్, ఉమా యాదవ్, బబ్లూ, శంకర్ , దత్త, పొదిలపు నాగు, కొండేటి సుధ, పులి సాగర్, సుందర్ సింగ్, దూలం ప్రసాద్, పెద్ద , అరుణ్ , చిట్టాబత్తుల నాగబాబు, నంద కిషోర్, సంతోష్, కృష్ణవేణి, కుమారి, సూర్య కుమారి, సాల సావిత్రి, అనంత లక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.

# గంగవరంలో ఘనంగా గురుపూజోత్సవ వేడుకలు





- విద్యార్థుల్లో నైతిక విలువలను పెంపొందించాలి
- సర్వేపల్లి రాధాకృష్ణన్ ఆశయాల సాధనకు ఉపాధ్యాయులు కృషి చేయాలి

**గంగవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 5:** విద్యార్థులకు కేవలం పాఠ్యాంశాలను బోధించడమే కాకుండా వారిలో నైతిక విలువలు, క్రమశిక్షణ, మానవీయత, సామాజిక బాధ్యత వంటి మంచి లక్షణాలను పెంపొందించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని తహసీల్దార్ చిన్నం శ్రీనివాస్ రావు అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ గంగవరం మండల శాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవ వేడుకలను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. మండల శాఖ అధ్యక్షులు కారం బొజ్జిదొర అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల్లో విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ చిన్నం శ్రీనివాస్ రావు మాట్లాడుతూ, ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అన్నారు. విద్యతో పాటు మంచి విలువలను బోధించి, బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ఎంపీడీఓ వై. లక్ష్మణరావు మాట్లాడుతూ భారతదేశం గర్వించదగిన ఉపాధ్యాయుడు, తత్వవేత్త, మాజీ రాష్ట్రపతి డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ సేవలను స్మరించుకున్నారు. ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ఉపాధ్యాయులు సమాజ నిర్మాణంలో తమ బాధ్యతను మరింత సమర్థవంతంగా నిర్వర్తించాలని అన్నారు. మండల విద్యాశాఖాధికారి-2 టి. మల్లేశ్వరరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులను గౌరవించుకునేందుకు గురుపూజోత్సవం ఒక గొప్ప వేదిక అని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. పోలవరం జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ మాట్లాడుతూ గత 25 సంవత్సరాలుగా యుటిఎఫ్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానిస్తూ వారి సేవలను గుర్తించి ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. గంగవరం మండలానికి చెందిన పలువురు ఉపాధ్యాయులు మండలంతో పాటు జిల్లా స్థాయిలో కూడా అవార్డులు పొందడం అభినందనీయమని పేర్కొని, అవార్డు గ్రహీతలకు శుభాకాంక్షలు తెలిపారు.

**జిల్లా అవార్డు గ్రహీతలు**

ఆర్.వి.వి. సత్యనారాయణ, పి. ఉమాదేవి, పి. మీనా కుమారి, సిహెచ్. చిన్న శ్రీనివాస దొర, కె. వెంకటేశ్వర్లు దొర, కె. జానకమ్మలను ఈ సందర్భంగా అభినందించారు.

**మండల స్థాయి అవార్డు గ్రహీతలు**

ఎస్. చిట్టమ్మ (ఎస్ఏ--హిందీ), కె. వీర్రాజు (ఎస్ఏ--సోషల్), పి. రామన్న దొర (ఎస్‌జీటీ), ఈ. లక్ష్మణరావు (ఎస్ఏ--ఇంగ్లీష్), కె. లావణ్య (ఎస్‌జీటీ), సిహెచ్. నాగేశ్వరరావు (పీఎస్ హెచ్‌ఎం), సిహెచ్. నగేష్ (ఎస్‌జీటీ)లను మండల స్థాయి అధికారులు, యుటిఎఫ్ నాయకులు ఘనంగా సన్మానించారు. సన్మాన కార్యక్రమంలో తహసీల్దార్ చిన్నం శ్రీనివాస్ రావు, ఎంపీడీఓ వై. లక్ష్మణరావు, ఎంఈఓ-2 టి. మల్లేశ్వరరావు, పోలవరం జిల్లా యుటిఎఫ్ ప్రధాన కార్యదర్శి కె. కృష్ణ, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు బి. నాగేశ్వరరావు, ఆర్.వి.వి. సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే యుటిఎఫ్ గంగవరం మండల ప్రధాన కార్యదర్శి సిహెచ్. రామకృష్ణ రెడ్డి, మహిళా అధ్యక్షురాలు రుక్మిణి దేవి, గౌరవ అధ్యక్షులు సిహెచ్. రాంబాబు దొర, జిల్లా కార్యదర్శులు వెంకటేశ్వరరావు, రఘుబాబు, కోశాధికారి సత్యకిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

02

ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో

శుభాకాంక్షలు యాడ్స్

కేవలం

యాడ్ 300/-

'పోస్టుకార్డు సైజు '

'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'

'మరిన్ని వివరాలకు సంప్రదించండి '

93948 55244

షరతులు వర్తిస్తాయి

# సోకులగూడెంలో ఎల్ఐసి ఆధ్వర్యంలో మెగా ఉచిత వైద్య శిబిరం





- 200 మంది గిరిజనులకు ఉచిత వైద్య పరీక్షలు, మందుల పంపిణీ
- ఎల్ఐసి 70వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా సేవా కార్యక్రమం

**గంగవరం/రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 5:** భారతీయ జీవిత బీమా సంస్థ (ఎల్ఐసి) స్థాపించి 70 సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న బీమా వారోత్సవాల్లో భాగంగా రంపచోడవరం మండలం సోకులగూడెం గిరిజన గ్రామంలో మెగా ఉచిత వైద్య శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించారు. శిబిరంలో సుమారు 200 మంది గిరిజనులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. ఎల్ఐసి రాజమండ్రి డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ ఆధ్వర్యంలో, గోకవరం ఎల్ఐసి బ్రాంచ్ సీనియర్ మేనేజర్ డి.ఎస్.వి. సూర్యనారాయణ పర్యవేక్షణలో ఈ వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భారతీయ జీవిత బీమా సంస్థ గత 70 సంవత్సరాలుగా దేశ ప్రజలకు బీమా భద్రత కల్పించడమే కాకుండా సామాజిక సేవా కార్యక్రమాల ద్వారా గ్రామీణ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కూడా తన వంతు సహకారం అందిస్తోందన్నారు. దేశ అభివృద్ధిలో ఎల్ఐసి కీలక పాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఎల్ఐసి గోల్డెన్ జూబ్లీ ఫౌండేషన్ ద్వారా ప్రతి సంవత్సరం స్కాలర్‌షిప్‌లు అందించడం గర్వకారణమని అన్నారు. ఎల్ఐసి 70వ వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా మారుమూల గిరిజన గ్రామమైన సోకులగూడెంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించడం ఎంతో ఆనందంగా ఉందని తెలిపారు. వైద్య శిబిరం నిర్వహణకు సహకరించిన గోకవరం కేర్ హాస్పిటల్, రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయం, రాజమండ్రి లయన్స్ క్లబ్ సంస్కృతి సభ్యులు, వైద్యులు, వైద్య సిబ్బందికి సత్యనారాయణ సాహూ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**వివిధ వైద్య సేవలు**

ఈ మెగా వైద్య శిబిరంలో గోకవరం కేర్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ జి. ప్రదీప్, ఆస్పత్రి సిబ్బంది, రాజమహేంద్రవరం గౌతమి నేత్రాలయం ప్రతినిధి ఫణి, వారి వైద్య సిబ్బంది, రాజమండ్రి లయన్స్ క్లబ్ సంస్కృతి వైద్య సిబ్బంది పాల్గొని గిరిజన ప్రజలకు వైద్య సేవలు అందించారు. వివిధ ఆరోగ్య సమస్యలకు పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఉచితంగా మందులను పంపిణీ చేశారు.

**వైద్యులు, ఉపాధ్యాయులకు సన్మానం**

వైద్య శిబిరం విజయవంతానికి సహకరించిన వైద్యులు, వైద్య సిబ్బంది, గ్రామ పెద్దలను ఎల్ఐసి రాజమండ్రి డివిజనల్ మేనేజర్ సత్యనారాయణ సాహూ ఘనంగా సన్మానించి అభినందించారు. అలాగే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఉపాధ్యాయులు శ్రీరాములు దొర, వెంకటేశ్వర్లు, అనిల్, వీరభద్రరావులను ప్రత్యేకంగా సత్కరించారు. విద్యా రంగానికి వారు అందిస్తున్న సేవలను కొనియాడుతూ వారికి అభినందనలు తెలిపారు.

గోకవరం ఎల్ఐసి సీనియర్ బ్రాంచ్ మేనేజర్ డి.ఎస్.వి. సూర్యనారాయణ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎల్ఐసి వివిధ విభాగాల మేనేజర్లు సూర్యనారాయణ, రంగనాయకులు, సుధాకర్, వెంకటకుమార్ పాల్గొన్నారు. అలాగే ఎల్ఐసి ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు ఎం. కోదండరాం, ఈశ్వరరావు, డి.వి. కిషోర్, గన్నయ్య, ఏ.కే. విశ్వనాథం, శ్రీనివాస్, రమేష్ తదితరులు హాజరయ్యారు.

కార్యక్రమంలో గోకవరం ఏజెంట్ మిత్రులు ముత్యం జయరావు, దుర్గాప్రసాద్, జయకృష్ణ పట్నాయక్, వెంకన్న దొర, నాగరాజు, గ్రామ పెద్దలు ప్రేమలత, చిన్నారి దొర, ఎంపీటీసీ పాపారావు, నాగేశ్వరరావు, గ్రామ యువత, మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# ఉత్తమ ఉపాధ్యాయులకు కలెక్టర్ చేతి మీదగా ఘన సన్మానం ...



**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 05;**పోలవరం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అడ్డతీగల మండలం నుండి జె బి వి రమణమ్మ. మడిశెట్టి. జోగేశ్వరరావు , ముర్ల. నరసింహారెడ్డి, చవళం. అబ్బాయి దొర, గౌతు. మల్లీశ్వరి, బల్లా. ఇందిరా, స్వర్ణాంజలి , అల్లం. గంగాభవాని ఎంపికైనారు. శనివారం జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ రంపచోడవరంలో వీరందరికీ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు ప్రధానం చేశారు. జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీ రామమూర్తి, ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్ల .సునీత, ఎంపీపీ బంధం. శ్రీదేవి, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని ఎంఈఓ శ్రీనివాస్, నాయకులు అభినందనలు తెలిపారు.

# గోపాలపురం దళిత ఎమ్మెల్యేకు జక్కంపూడి క్షమాపణ చెప్పాలి

మీడియా సమావేశంలో టీడీపీ రాష్ట్ర బీసీ నాయకుడు బర్ల డిమాండ్



**రాజమహేంద్రవరం , పెన్ పవర్, సెప్టెంబర్ 5:**తూర్పుగోదావరి జిల్లాలో దళితులు, బలహీనవర్గాల పట్ల వైసిపి నాయకులు జక్కంపూడి రాజా కుటుంబం దాడులు, దౌర్జన్యాలతో శాంతి, భద్రతలకు విఘాతం కలిగిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం, తెలుగుదేశం రాష్ట్ర నాయకుడు, బర్ల బాబురావు విమర్శించారు. స్థానిక ప్రెస్ క్లబ్ లో శనివారం మీడియా సమావేశంలో బర్ల మాట్లాడుతూ, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురం దళిత ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజును వైసిపి నాయకుడు జక్కంపూడి అసభ్యకరంగా దూషించడాన్ని ఖండిస్తున్నామన్నారు. రాజకీయాల్లో విమర్శలు రాజకీయంగా ఉండాలని వ్యక్తిగత దూషణకు దిగడం జక్కంపూడి కుటుంబానికి అహంకారపూరితంగా మారిందన్నారు. ప్రజలు ఎన్నుకున్న ఎమ్మెల్యేను బహిరంగంగా దూషించడంపై జక్కంపూడి రాజా రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ కాళ్ళు కడిగి విగ్రహం కాళ్లు కడిగి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వం లో దళితులు, బలహీన వర్గాలపై చేసిన జక్కంపూడి రాజా కుటుంబం చేసిన దాడులు మర్చిపోయిందనిన్నారు. ఇటీవల పెట్రోలు సీసాలతో తనపై హత్య యత్నానికి జక్కంపూడి కుటుంబం పాల్పడిన సంఘటన గుర్తు చేశారు. వైసీపీ పార్టీలో అరాచకంగా తయారైన జక్కంపూడి రాజా కుటుంబాన్ని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. వైసిపి పార్టీ అధినేత జగన్ బీసీలు, దళితులు నా దేవుళ్ళు ప్రచారం చేసుకుంటారని, క్రింది స్థాయి ఎమ్మెల్యేలు, నాయకులు బడుగు బలహీన వర్గాల పై హ త్యాకాండలకు తెగబడుతుంటారన్నారు. జక్కంపూడి కుటుంబం ను జగన్ దూరం పెడుతున్నారని ఆ డిప్రెషన్లో దళితులు బీసీలపై దాడులు చేస్తున్నారని ఆరోపించారు. వైసిపి ప్రభుత్వ హయాంలో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు, జగన్ బొమ్మ తో సహా నీలం రంగులు, పార్టీ రంగులు ఎవరి తాతల సొమ్ముతో వేసుకున్నారన్నది ప్రజలందరికీ తెలిసిందే అన్నారు. సమావేశంలో ఈ సమావేశంలో ఈ సమావేశంలో బీసీ నాయకులు పితాని కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

# గంజాయికి దూరంగా ఉండాలి.. యువత భవిష్యత్తును కాపాడుకోవాలి







**మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రజల సహకారం అత్యవసరం**

**గంగవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 5:** గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని, వాటి బారిన పడితే వ్యక్తిగత ఆరోగ్యంతో పాటు కుటుంబ జీవితం, సమాజంలో భవిష్యత్తు కూడా దెబ్బతింటుందని అడ్డతీగల సర్కిల్ సీ ఇన్స్పెక్టర్ ఎం. గజేంద్ర కుమార్, ఈగల్ టీం ఇన్స్పెక్టర్ సూర్య మోహన్ అన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలనకు పోలీసు శాఖతో పాటు ప్రజలు కూడా బాధ్యతగా వ్యవహరించి సహకరించాలని పిలుపునిచ్చారు.పాత గంగవరం వారపు సంతలో గంజాయి నివారణ, మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలపై గంగవరం ఎస్సై వెంకయ్య ఆధ్వర్యంలో పోలీసులు, పోలవరం జిల్లా ఈగల్ సిబ్బంది విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సంత ప్రాంగణంలో అవగాహన ర్యాలీ చేపట్టారు.ఈ సందర్భంగా సీఐ ఎం. గజేంద్ర కుమార్ మాట్లాడుతూ, గంజాయి వినియోగం అనేది ఒక వ్యక్తి ఆరోగ్యాన్ని మాత్రమే కాకుండా అతని కుటుంబాన్ని, ఆర్థిక పరిస్థితిని, భవిష్యత్తును కూడా ప్రభావితం చేస్తుందన్నారు. ముఖ్యంగా యువత గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు."యువతే దేశ భవిష్యత్తు. క్షణిక ఆనందం కోసం మాదక ద్రవ్యాల బారిన పడితే జీవితమే అంధకారమవుతుంది. యువత తమ లక్ష్యాలను నిర్దేశించుకుని విద్య, ఉపాధి, క్రీడలు వంటి సానుకూల మార్గాల్లో ముందుకు సాగాలి" అని ఆయన పేర్కొన్నారు.గ్రామాల్లో ఎవరైనా గంజాయి సాగు, అక్రమ రవాణా, నిల్వ, విక్రయాలు లేదా వినియోగానికి పాల్పడుతున్నట్లు సమాచారం తెలిసిన వెంటనే ప్రజలు పోలీసులకు తెలియజేయాలని సీఐ కోరారు. గంజాయి నిర్మూలనలో ప్రజలు అందించే సమాచారం ఎంతో కీలకమని, సమాచారాన్ని అందించడంలో ప్రజలు వెనుకాడవద్దని సూచించారు. ఈగల్ టీం ఇన్స్పెక్టర్ సూర్య మోహన్ మాట్లాడుతూ గంజాయి సంబంధిత సమాచారం అందించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్‌ఫ్రీ నంబర్ 1972ను వినియోగించుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేసి వెంటనే పోలీసు సహాయం పొందవచ్చని వివరించారు.మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కేవలం పోలీసుల వల్ల మాత్రమే సాధ్యం కాదని, ప్రజలందరూ భాగస్వాములు కావాలని అన్నారు. ప్రతి గ్రామంలో యువతను చైతన్యవంతం చేయడంతో పాటు గంజాయి వంటి మాదక ద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలను విస్తృతంగా తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు.ఈ సందర్భంగా ఈగల్ టీ ం సీఐ సూర్యమోహన్, పోలవరం జిల్లా ఈగల్ సిబ్బంది కూడా ప్రజలకు గంజాయి నివారణ, మాదక ద్రవ్యాల నియంత్రణపై అవగాహన కల్పించారు. అనంతరం పాత గంగవరం సంతలో పోలీసులు, ఈగల్ సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించి ప్రజలకు మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంపై సందేశాలు అందించారు.ఈ కార్యక్రమంలో గంగవరం ఎస్ఐ వెంకయ్య, ఏఎస్ఐ రత్నాకర్, పీసీ అశోక్, ఈగల్ ఎస్ఐలు మావుళ్ళు, నరేష్ కుమార్, ఈగల్ సిబ్బంది, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఆక్రమణల తొలగింపుకై స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలి



**కమిషనర్ రాహుల్ మీనా**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 5:** నగరంలో ఆక్రమణల తొలగింపునకై పట్టణ ప్రణాళిక , ప్రజారోగ్య విభాగాలు సమన్వయంతో స్పెషల్ డ్రైవ్ నిర్వహిం చాలని కమిషనర్ రాహుల్ మీనా ఆదేశించారు. శనివారం నగరపాలక సంస్థ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్ నందు టౌన్ ప్లానింగ్ మరియు పబ్లిక్ హెల్త్ అధికారులు, సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నెలాఖరు లోగా నగరంలోని రోడ్లు, ఫుట్ పాత్ లు, డ్రెయిన్లపైన ఉన్న అనధికార నిర్మాణా లు, ఆక్రమణలను యుద్ధప్రాతిపదికన తొలగించాలని ఆదేశించా రు. ప్రజా భద్రత, ప్రణాళి ఆకాబద్ధమైన నగర అభివృద్ధి దృష్ట్యా అమలులో ఉన్న నిబంధనల ప్రకారం ఈ చర్యలు చేపట్టవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. నగర పరిధిలో నిబంధనల మేరకు వ్యాపార కార్యకలాపాలు నిర్వహించుకోవచ్చన్నారు. రహదారులు, డ్రెయిన్లు, ఫుట్ పాత్ లపై కంటైనర్లు, షెడ్లు, ఇతర శాశ్వత నిర్మాణాలను ఏర్పాటు చేయడం అనుమతించ బడదని స్పష్టం చేశారు. ఆక్రమణదారులకు నోటీసులు జారీచేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆక్రమణల తొలగింపు నకు ముందు-తర్వాత ఫోటోలు తప్పనిసరిగా రికార్డు చేసుకోవాలన్నారు. కాలువల్లో వాటర్ లైన్లు, విద్యుత్ స్థంభాలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆక్రమణలను తొలగిస్తే తప్ప జంక్షన్ల అభివృద్ధి, రోడ్ల విస్తరణ సాధ్యపడదని అభిప్రాయం వ్యక్తం చేశారు. కనుక ఆక్రమణల తొల గింపులో అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహ రించాలన్నారు. నగరంలో వాహనాల రాకపోకలు మరింత సులభంగా మారతా యన్నారు. ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ఫ్రీ లెఫ్ట్ ఉండేలా చూడాలన్నారు. ఆస్పత్రు లకు పార్కింగ్ ప్రదేశం తప్పనిసరిగా ఉండాలని, అంబులెన్స్ లు, పేషంట్ల వాహనాలను సెల్లార్ లోనే పార్కింగ్ చేసుకోవాలని స్పష్టం చేశారు. రహదారుల వెంబడి పార్కింగ్ చేస్తే ఉపేక్షించేది లేదని తేల్చి చెప్పారు. రోడ్లపైకి వచ్చిన భవనాల ర్యాంపులు సైతం తొలగించాలన్నారు. అనధికారిక, అనుమతి లేని ఫ్లెక్సీలను బ్యానర్లపై కఠినంగా వ్యవహరించాలన్నారు. నగర అందాన్ని దెబ్బతీసేలా, ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను తక్షణమే తొలగించాలన్నారు. వినాయక చవితి మండపాలను ఏర్పాటు చేసుకునే సమయంలో పోల్స్ కోసం ఇసుక బస్తాలను వినియోగించేలా ఆయా కమిటీ సభ్యులకు అవగాహన కల్పించాలని.. ఎక్కడా రోడ్లు, ప్రభుత్వ ఆస్తులకు నష్టం కలగకుండా చూడాలన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే తమ దృష్టికి తీసుకురావాలని.. పరిష్కరించేందుకు తాను సిద్ధమని తెలియజేశారు. ప్రజలు కూడా స్వచ్ఛందంగా ముందుకు వచ్చి నగర అభివృద్ధి సుందరీకరణ పనులకు మద్ధతు తెలిపాలని కోరారు. ఈ సమావేశంలో సిటీ ప్లానర్ జీవీఎస్ఎన్ మూర్తి, ఎంహెచ్ఓ వినూత్న, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఈనెల 17 నుండి అక్టోబర్ 17 వరకు సేవా సంకల్ప ఉత్సవాలు



**ప్రధాని మోడీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి**

**రాజమహేంద్రవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 5:**ప్రధాని నరేంద్ర మోడీ ప్రజా సేవలో 25 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా స్ఫూర్తిగా తీసుకుని సెప్టెంబర్ 17 నుండి అక్టోబర్ 17 వరకు "సేవా సంకల్ప ఉత్సవాల" నిర్వహించనున్నారు. తూర్పుగోదావరి జిల్లా అధ్యక్షులు ఫిక్కీ నాగేంద్ర ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కార్యశాల బిజెపి జిల్లా కార్యాలయంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ సోము వీర్రాజు విచ్చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్మలు దత్తు, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు రోంగల గోపి శ్రీనివాస్ ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నర్సిపల్లి హారిక, కురుగంటి సతీష్, రేలంగి శ్రీదేవి, ఆకుల శ్రీధర్, ఫి మురళి , స్వర్ణ రజని శెట్టిపల్లి శివ నాగరాజు, కందుకూరి మనోజ్, పెరుమాళ్ళ పవన్, వై వి ఆర్ చౌదరి, కందికొండ రమేష్, తదితరులు పాల్గొన్నారు

## పోలవరం జిల్లాలో సెప్టెంబర్ 9న మెగా జాబ్‌మేళా



- 40 ప్రముఖ కంపెనీల్లో సుమారు 1,500 ఉద్యోగాల భర్తీకి అవకాశం
- అర్హతలను బట్టి రూ.15 వేల నుంచి రూ.50 వేల వరకు వేతనం
- కలెక్టర్ కె. దినేష్ కుమార్

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ సెప్టెంబర్ 5:** పోలవరం జిల్లాలోని చదువుకున్న యువతీ యువకులకు ప్రైవేట్ రంగంలో ఉపాధి అవకాశాలు కల్పించే లక్ష్యంతో ఈ నెల 9వ తేదీన మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు. సుమారు 40 ప్రముఖ కంపెనీల ఆధ్వర్యంలో నిర్వహించే ఈ జాబ్‌మేళాలో దాదాపు 1,500 ఉద్యోగాలకు అర్హులైన అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు.శనివారం రంపచోడవరంలోని ఐటీడీఏ కార్యాలయంలోని తన ఛాంబర్‌లో మెగా జాబ్‌మేళాకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను కలెక్టర్ కె. దినేష్ కుమార్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పోలవరం జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ప్రైవేట్ రంగంలో అందుబాటులో ఉన్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకునేందుకు ఈ మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

**ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో నిర్వహణ**

సెప్టెంబర్ 9న స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. పదో తరగతి నుంచి పోస్టు గ్రాడ్యుయేషన్ వరకు వివిధ విద్యార్హతలు కలిగిన యువతీ యువకులు జాబ్‌మేళాలో పాల్గొని తమ అర్హతలకు అనుగుణంగా ఉద్యోగాలను పొందవచ్చని సూచించారు.ఎంపికైన అభ్యర్థులకు వారి ఉద్యోగ స్వభావం, అర్హతలు, కంపెనీ నిబంధనలను బట్టి నెలకు రూ.15,000 నుంచి రూ.50,000 వరకు వేతనం లభించే అవకాశం ఉందన్నారు.

**40 ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగావకాశాలు**

మెగా జాబ్‌మేళాలో హైట్స్ ప్రైవేట్ లిమిటెడ్, సీఎస్‌బీ బ్యాంక్, టెక్ వర్క్స్, హెచ్‌జీఎస్, లైరోస్, ఫాక్స్‌కాన్, టాటా ఎలక్ట్రానిక్స్, యూనిస్ ట్రింగ్స్, ఓలేట్రా గ్రీన్‌టెక్, స్కైకార్డ్ ఎలక్ట్రానిక్స్, ఎం పోనిక్, టీవీఎస్, అపోలో టైర్స్, ప్రైమర్ ఇంజనీర్స్, ఇసుజి మోటార్స్, ఇస్కానిక్, ఇమరిక్ సొల్యూషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు.అలాగే ఎన్ఐఐటీ, ఐసీఐసీఐ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, దక్కన్ కెమికల్స్, ఇండస్ కాఫీ, ఇండోమిం, పీహెచ్‌కే, హ్యుందాయ్ మొబైల్స్, హ్యుందాయ్ గ్లోవ్స్, కేఐఎంఎల్, ఐఎన్‌జెడ్ఐ, ఫిల్టింగ్‌టన్, వీల్ స్మార్ట్, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్, ఎంసీవీ, వెరిటర్స్ ఫైనాన్స్, మహీంద్రా ట్రాక్టర్స్, పీనర్ మహీంద్రా, వరుణ్ మోటార్స్, అపోలో ఫార్మసీ, డీడీయూజీకేవై తదితర సంస్థల ద్వారా కూడా ఉద్యోగ నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు.

**అవసరమైన ధ్రువపత్రాలు తప్పనిసరి**

జాబ్‌మేళాకు హాజరయ్యే అభ్యర్థులు ఆధార్ కార్డు, విద్యార్హతలకు సంబంధించిన ఒరిజినల్ ధ్రువపత్రాలు, వాటి జిరాక్స్ ప్రతులు, పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తప్పనిసరిగా వెంట తీసుకురావాలని కలెక్టర్ సూచించారు.పోలవరం జిల్లాలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ప్రైవేట్ రంగంలో ఉపాధిని పొందాలని ఆయన కోరారు. ఉద్యోగం ద్వారా ఆర్థికంగా స్వావలంబన సాధించి తమ భవిష్యత్తుకు బలమైన పునాది వేసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో వికాస ప్రాజెక్టు డైరెక్టర్ కె. లచ్చారావు, మేనేజర్ శర్మ, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి నీరూపమ, డీఎస్‌డీవో తిరుమలరావు తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ సేవలకు సత్కారం...



**ఉత్తమ సేవలకు ప్రతిభ పురస్కారాలు..**

**జిల్లా స్థాయిల అవార్డు అందుకున్న ఉపాధ్యాయులు.**

**ఎటపాక (పెన్ పవర్)సెప్టెంబర్ 05...**విద్యా శాఖ లో ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులకు పోలవరం జిల్లా కేంద్రంలో కలెక్టర్ దినేష్ కుమార్ చేతులు మీదుగా శనివారం ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఇందులో భాగంగా ఎటపాక మండలానికి చెందిన సోయం నవీన్ , సుగుణ, లలిత గాయత్రిలు అవార్డులు అందుకున్నారు. ఇందులో భాగంగా డీఈవో శ్రీరామ మూర్తి, కలెక్టర్ ప్రశంస పత్రం, జ్ఞాపికను అందజేసి, శాలువాతో సత్కరించారు. మెరుగైన సేవలు అందించేందుకు మరింత బాధ్యత పెరిగిందని నవీన్ అన్నారు.

## రాష్ట్ర స్థాయి కమిటీలో జోగారావు...

-కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యల పై జోగారావు పోరాటం



**కూనవరం,పెన్ పవర్ సెప్టెంబర్5.** విలీన మండలాల్లోని కూనవరం మండలం కోతులగుట్ట సిహెచ్సి లో ఫార్మసీ ఆఫీసర్‌గా పనిచేస్తున్న తుష్టి జోగారావుకు రాష్ట్ర స్థాయి కమిటీలో చోటు దక్కింది.కాంట్రాక్టు వైద్య ఉద్యోగులను రెగ్యులర్ చేయడం,వారి సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఈ కమిటీలో 3గురు ఐఏఎస్ అధికారులతో పాటు ఉద్యోగ సంఘ నాయకులకు స్థానం కల్పించారు. ఈ అరుదైన అవకాశంతో మన్యం ప్రాంత వైద్య ఉద్యోగుల సమస్యలు రాష్ట్ర స్థాయిలో చర్చకు వచ్చే అవకాశం ఉంది.జోగారావును స్థానిక నాయకులు,ఉద్యోగ సంఘాలు అభినందించారు.

## 8బాలలు...బోధనలో భళా..

- ఉపాధ్యాయులుగా విద్యార్థులు
- బాలలే..గురువులైన వేళ
- పాఠశాలల్లో స్వయం పాలన ప్రోగ్రామ్
- సెల్ఫ్ టీచింగ్ లో విద్యార్థుల ప్రతిభ
- శ్రీ ఆదిత్య స్కూల్ లో ప్రత్యేక వేడుకలు





**ఎటపాక (పెన్ పవర్) సెప్టెంబర్ 05:** బాలలే గురులైన వేళ ఉపాధ్యాయ దినోత్సవ వేడుకల్లో పలు పాఠశాలల్లో సందడి వాతావరణం నెలకొంది. ఎటపాక మండలం లోని పలు పాఠశాలల్లో శనివారం టీచర్స్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ఇందులో భాగంగా తోటపల్లి శ్రీ ఆదిత్య స్కూల్ లో కరెస్పాండెంట్ వెంకట్ ప్రిన్సిపల్ వెంకట రాజ్యలక్ష్మి ఆదేశాల మేరకు విద్యార్థులకు స్వయం పాలన దినోత్సవం నిర్వహించారు. ఇందుకోసం ముందస్తుగా సూచించిన సూచనల ప్రకారం విద్యార్థుల ఉపాధ్యాయుల కట్టు, బొట్టు, వేష ధారణలో పాఠశాలలకు వచ్చారు. ఇందులో భాగంగా పాఠశాల నిర్వహణ పూర్తిగా బాలలే నిర్వహించారు. 1వ తరగతి నుంచి పదో తరగతి వరకు పాఠ్యాంశాల బోధన విద్యార్థులే చేపట్టారు. ప్రతి రోజూ ఉపాధ్యాయులు ఏవిధంగా టైం టేబుల్ ప్రకారం ఖ ఉసరిస్తారో అదే విధంగా చేశారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో వారి అనుభవాలు తోటి విద్యార్థులతో పంచుకున్నారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ మాట్లాడారు. విద్యార్థులకు అనుభవాలే ముఖ్యమైన పాఠాలు అన్నారు. ప్రతి రోజూ ఉపాధ్యాయులు ఎలా కష్టపడుతున్నారు అన్నది అవగాహన కలుగుతుందన్నారు. సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రసన్న, నాగేశ్వరరావు, సంధ్య, శ్రీనివాసరావు, వరలక్ష్మి, నాగేంద్రమ్మ, జయంతి, ఇమాన్సి, వాసవి, వెంకటలక్ష్మి, శివాదేవి, శిరీష, ఆస్మా, నాగమణి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ విజేతలో ఘనంగా గురుపూజోత్సవం



**తాళ్లపూడి, పెన్ పవర్, సెప్టెంబర్ 5:**డా.సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా శ్రీ విజేత హై స్కూల్ నందు గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణంను రంగు రంగుల బెలూన్ లతో అలకరించారు. కార్యక్రమంలో డా.సర్వేపల్లి చిత్రపటానికి విద్యార్థులు, ఉపాధ్యాయులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. ఉపాధ్యాయ దినోత్సవం శుభాకాంక్షలు తెలియచేస్తూ, కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పాఠశాల విద్యార్థులు ఆయా తరగతి ఉపాధ్యాయులకు శాలువా, పూలమాల వేసి బహుమతులు అందచేశారు. అనంతరం గురువు ప్రాముఖ్యతను వివరిస్తూ విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. పాఠశాల ప్రధానోపాధ్యాయులు డా.జొన్నకూటి ప్రమోద్ కుమార్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జీవిత విశేషాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం ఉపాధ్యాయ సిబ్బందికి బహుమతులు అందచేశారు. టీచర్స్ డే ను పురస్కరించుకుని టీచర్స్ కి నిర్వహించిన ఆటల పోటీలలో విజేతలకు బహుమతులు అందచేశారు. పాఠశాల అధ్యాపక బృందం ఒకరికి ఒకరు శుభాకాంక్షలు తెలియచేసి, గిఫ్ట్స్ అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎం.కరుణ, సిహెచ్. తేజస్విని, ఎస్ వర్ధన్ రాజు, కె వెంకట్, వై విజయ్, కెగంగారత్నం, కె.సలోమి, సాయిలత, ప్రసన్న, రాజేశ్వరి, విద్యార్థులు పాల్గొన్నారు.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at printed at SRI SAI GANGA PRINTERS AND PUBLISHERS FLAT NO: 504, Bharat Towers, 5th lane, Dwaraka Nagar, Visakhaptanam, Andhrapradesh-530016, and published at Flat No F2, Nihar towers, Srinagar, kakinada, kakinada District, Andhrapradesh -533003 Editor: GANTYADA APPARAO. Mobile : 9059465965, RNI : APTEL/2017/73154 , editorpenpower@gmail.com

# తూర్పు గోదావరి జిల్లాలో 90 మంది ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుల ప్రదానం






**రాజమహేంద్రవరం, పెన్ పవర్, స్టాఫ్ రిపోర్టర్, సెప్టెంబర్ 5:** గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని తూర్పు గోదావరి జిల్లాలోని వివిధ పాఠశాలలకు చెందిన 90 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను శనివారం రాజమహేంద్రవరంలోని శ్రీ వెంకటేశ్వర ఆనం కళా కేంద్రంలో ఘనంగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన గురుపూజోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించుకోవడం, ఆయన ఉపాధ్యాయుడిగా సేవలందించిన రాజమహేంద్రవరం గడ్డపై గురుపూజోత్సవం నిర్వహించడం ఎంతో విశిష్టమైన విషయమన్నారు. విద్యార్థుల వ్యక్తిత్వ వికాసం, సంస్కారం, భాష, క్రమశిక్షణ వంటి అంశాలకు ఉపాధ్యాయుల బోధనే పునాది అని పేర్కొన్నారు. దేశ భవిష్యత్తు తరగతి గదుల్లోనే నిర్మితమవుతుందన్న భావనను నిజం చేసే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన విద్యా సంస్కరణలతో ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం, యూనిఫాంలు, విద్యార్థుల కిట్లు, మధ్యాహ్న భోజనం వంటి సౌకర్యాలు మెరుగుపడ్డాయని తెలిపారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు బాలికలకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం ద్వారా డ్రాపౌట్స్ తగ్గించేందుకు చర్యలు చేపట్టామని చెప్పారు. భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా, మరింత మెరుగైన విద్యను అందించే స్థాయికి ఎదుగుతాయని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతో పాటు తల్లిదండ్రులు, సమాజంలోని అన్ని వర్గాలు సమష్టిగా భాగస్వాములు కావాలని సూచించారు. రాష్ట్రంలో విద్యా సంస్కరణలకు శ్రీకారం చుట్టిన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌ను అభినందించారు. తూర్పు గోదావరి జిల్లాలో ప్రభుత్వ విద్యా సంస్కరణలను క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేస్తున్న ఉపాధ్యాయులను అభినందిస్తూ, విద్యారంగ అభివృద్ధికి ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం పూర్తిస్థాయిలో అందిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి మాట్లాడుతూ గురుపూజోత్సవం సందర్భంగా విద్యాబుద్ధులు నేర్పించి తమ జీవితాలకు మార్గనిర్దేశం చేసిన గురువులను స్మరించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమాజాన్ని జాగృతం చేయడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, భావితరాలకు దిశ, దశను నిర్దేశించగల శక్తి ఉపాధ్యాయులకే ఉందని పేర్కొన్నారు. విద్యార్థుల్లో చదువు పట్ల ఆసక్తి, నమ్మకం పెంపొందించడంతో పాటు వారి ఆలోచనా విధానంలో, ప్రవర్తనలో సానుకూల మార్పు తీసుకురావడానికి ఉపాధ్యాయులు ప్రేరణగా నిలవాలని సూచించారు.

మారుతున్న కాలానికి అనుగుణంగా వినూత్నమైన, సృజనాత్మక బోధనా పద్ధతులను అవలంబించి పాఠాలను ఆసక్తికరంగా బోధించడం ద్వారా విద్యార్థుల్లో దీర్ఘకాలిక లక్ష్యాలను ఏర్పరచుకునే సామర్థ్యాన్ని పెంపొందించవచ్చని అన్నారు. ప్రతి విద్యార్థిలోనూ అంతర్లీనంగా ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుందని, దానిని గుర్తించి సరైన ప్రోత్సాహం, మార్గదర్శకత్వం అందిస్తే వారు అద్భుతమైన విజయాలు సాధించగలరని తెలిపారు. విద్యార్థులకు విద్య ఎంత ముఖ్యమో క్రీడలు కూడా అంతే ముఖ్యమని, క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు మానసిక వికాసం, క్రమశిక్షణ, జట్టు స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు పెంపొందుతాయని అన్నారు. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యాంశాలకే పరిమితం కాకుండా విద్యార్థులను సాంస్కృతిక, క్రీడా, సృజనాత్మక రంగాల్లోనూ ప్రోత్సహించి వారి సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కలెక్టర్ ఆకాంక్షించారు. ప్రతి విద్యార్థి తనలోని ప్రతిభను గుర్తించి, లక్ష్యాన్ని నిర్దేశించుకుని ఉన్నత స్థానాలకు ఎదిగేలా ఉపాధ్యాయులు నిరంతరం ప్రోత్సహించాలని సూచించారు. సభాధ్యక్షులు, రాజమహేంద్రవరం సిటీ శాసనసభ్యులు ఆదిరెడ్డి శ్రీనివాస్ మాట్లాడుతూ విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి, వారిలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి బాధ్యతాయుతమైన పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకమన్నారు. ఉపాధ్యాయులకు తగిన గౌరవం కల్పిస్తూ, వారి సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు. అనపర్తి శాసనసభ్యులు నల్లమిల్లి రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ సమాజాన్ని తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత గొప్పదని, బోధన కేవలం వృత్తి కాదని, అది ఒక గొప్ప బాధ్యత అని అన్నారు. భారతీయ సంస్కృతిలో గురువుకు 'ఆచార్య దేవోభవ' అంటూ వేల సంవత్సరాలుగా ప్రత్యేక స్థానం కల్పించారని గుర్తుచేశారు. జాయింట్ కలెక్టర్ వై.మేఘా స్వరూప్ మాట్లాడుతూ, ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా గురువుల సేవలను, వారి ప్రాముఖ్యతను స్మరించుకుని గౌరవించాల్సిన అవసరం ఉందన్నారు. ఉపాధ్యాయులు కేవలం పాఠ్యపుస్తకాలు, పాఠ్యాంశాలను బోధించేవారు మాత్రమే కాకుండా సమాజం, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే కీలక శక్తి అని పేర్కొన్నారు. ఉత్తమ ఉపాధ్యాయులు విద్యార్థుల్లో జిజ్ఞాస, ప్రశ్నించే తత్వం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించి, వారిలో దాగి ఉన్న పూర్తి ప్రతిభను వెలికితీసేలా కృషి చేస్తారని అన్నారు. ప్రతి విద్యార్థి తన సామర్థ్యాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని ఆకాంక్షించారు.

తాళ్లపూడి మండలం నుండి వి.దేవీ వరలక్ష్మి , కె.ప్రసాదరావు, జె.డి.సునీత, కె.భరత్ రాజ్ లు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులుగా అవార్డులు పొందారు. వీరికి ఎంఈఓ బాలామణి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో సహాయ కలెక్టర్ ఆదిత్య శర్మ, క్రైమ్ డీఎస్పీ సుభాష్, జిల్లా పాఠశాల విద్యాధికారి కె.వాసుదేవరావు, పేరెంట్ టీచర్ అసోసియేషన్ అధ్యక్షులు చౌదరి, సమగ్ర శిక్ష పీడీ ఎస్.సుభాషిణి, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, వారి కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

# సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర ఎంతో కీలకం







- **పోలవరం జిల్లాను విద్యారంగంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలపాలి**
- **గురుపూజోత్సవం సందర్భంగా 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం**
- **కలెక్టర్ కె. దినేష్ కుమార్**

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్, సెప్టెంబర్ 5:** సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పోలవరం జిల్లా కలెక్టర్ కె. దినేష్ కుమార్ అన్నారు. నూతన పోలవరం జిల్లాను విద్యారంగంలో రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులందరూ సమష్టిగా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.భారతదేశ తొలి ఉపరాష్ట్రపతి, రెండవ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త, విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని శనివారం రంపచోడవరం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో గురుపూజోత్సవ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కలెక్టర్ కె. దినేష్ కుమార్, రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, ఎంపీపీ బంధం శ్రీదేవి, వైస్ ఎంపీపీ కె. బాలకృష్ణ తదితరులతో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశాలు బోధించడమే కాకుండా క్రమశిక్షణ, నైతిక విలువలు, బాధ్యతాయుతమైన జీవన విధానాన్ని నేర్పిస్తూ వారి భవిష్యత్తుకు ఉపాధ్యాయులు బాటలు వేస్తున్నారని అన్నారు. ఒక మంచి విద్యార్థిని ఉత్తమ పౌరుడిగా తీర్చిదిద్దడంలో గురువుల పాత్ర ఎంతో గొప్పదని పేర్కొన్నారు.డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం సెప్టెంబర్ 5న దేశవ్యాప్తంగా ఉపాధ్యాయ దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామని తెలిపారు. మధ్యతరగతి కుటుంబం నుంచి వచ్చిన రాధాకృష్ణన్ ఉపాధ్యాయుడిగా తన ప్రస్థానాన్ని ప్రారంభించి దేశ రాష్ట్రపతి స్థాయికి ఎదగడం నేటి తరానికి ఎంతో స్ఫూర్తిదాయకమని అన్నారు.

**ప్రతి విద్యార్థిని సొంత బిడ్డగా భావించి తీర్చిదిద్దాలి.**

ప్రతి ఉపాధ్యాయుడు తన తరగతి గదిలోని విద్యార్థులను సొంత పిల్లల మాదిరిగా భావించి వారి ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని కలెక్టర్ సూచించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల మధ్య కుటుంబ సభ్యుల వంటి అనుబంధం ఏర్పడినప్పుడే వారి వ్యక్తిత్వ వికాసానికి బలమైన పునాది పడుతుందని అన్నారు.

ప్రతి ప్రభుత్వ పాఠశాలలో నాణ్యమైన విద్య అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని స్పష్టం చేశారు. పాఠాలను విద్యార్థులకు సులభంగా అర్థమయ్యే రీతిలో బోధించాలని, అవసరమైతే ఒకటికి రెండుసార్లు పునరావృతం చేస్తూ వారికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని సూచించారు. విద్యార్థులు తరగతి గదిలో నేర్చుకున్న అంశాలను ఎప్పటికప్పుడు పునశ్చరణ చేసుకునేలా ప్రోత్సహించాలని అన్నారు.

**విద్యలో పోలవరం జిల్లాను ప్రథమ స్థానంలో నిలపాలి**

నూతన పోలవరం జిల్లాలో విద్యాభివృద్ధికి అవసరమైన మార్పులు తీసుకువచ్చి, విద్యారంగంలో జిల్లాను రాష్ట్రంలోనే ప్రథమ స్థానంలో నిలిపేందుకు ఉపాధ్యాయులందరూ సమష్టిగా కృషి చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు.

పోలవరం జిల్లాలోని విద్యార్థులకు ప్రపంచస్థాయిలో గుర్తింపు లభించేలా వారి ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యారంగంలో ఒక రోల్‌మోడల్‌గా ఎదిగేలా ఉపాధ్యాయులు మార్గనిర్దేశం చేయాలని అన్నారు.దేశం, రాష్ట్రం, జిల్లా, మండలం, గ్రామ అభివృద్ధిలో తమ వంతు పాత్ర పోషించే బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దాలని సూచించారు. ప్రతి తరగతి గదిలో ఉన్న సుమారు 40 మంది విద్యార్థుల జీవితాలను మార్చగల శక్తి ఉపాధ్యాయుల బోధనలో ఉందని కలెక్టర్ పేర్కొన్నారు.ఉపాధ్యాయ వృత్తి ఎంతో గొప్పదని, విద్యార్థులు జీవితంలో ఉన్నత శిఖరాలకు చేరుకున్నప్పుడు తమ గురువులను జీవితాంతం గుర్తుంచుకుంటారని అన్నారు.

**60 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సత్కారం**

పోలవరం జిల్లాలోని 12 మండలాలకు చెందిన వివిధ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల పనితీరును పూర్తిస్థాయిలో పరిశీలించి 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులను అవార్డులకు ఎంపిక చేసినట్లు కలెక్టర్ కె. దినేష్ కుమార్ తెలిపారు.ఈ సందర్భంగా ఎంపికైన 60 మంది ఉత్తమ ఉపాధ్యాయులకు శాలువాలు, పూలమాలలు, మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందజేసి ఘనంగా సత్కరించారు. అవార్డు పొందిన ఉపాధ్యాయులు భవిష్యత్తులో మరిన్ని ఉన్నత స్థాయి అవార్డులు అందుకునేలా విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ ఆకాంక్షించారు.అలాగే ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు ఆహ్లాదకరమైన, పరిశుభ్రమైన, ఆరోగ్యకరమైన వాతావరణంలో విద్యను అభ్యసించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు.గురుపూజోత్సవాన్ని పురస్కరించుకుని పోలవరం జిల్లాలోని ఉపాధ్యాయులందరికీ కలెక్టర్ కె. దినేష్ కుమార్ ప్రత్యేక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యురాలు గొర్లె సునీత, ఎంపీపీ బంధం శ్రీదేవి, వైస్ ఎంపీపీ కె. బాలకృష్ణ, జిల్లా విద్యాశాఖ అధికారి జి. శ్రీరామ్ మూర్తి, డీవైఈఓ ఆర్.ఎల్. శ్రీనివాసరావు, జిల్లా విద్యాశాఖ కార్యాలయ అధికారులు బి. చిన్ని బాబు, సారాపు చిన్నబాబు, అర్చన, మండల విద్యాశాఖ అధికారులు, వివిధ ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, అవార్డు గ్రహీతలు తదితరులు పాల్గొన్నారు.

# నేడు రంపచోడవరంలో ఐదు గంటల పాటు విద్యుత్ సరఫరా నిలిపివేత

**గంగవరం /రంపచోడవరం, పెన్ పవర్ ,సెప్టెంబర్ 5:** రంపచోడవరం 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు, ఆధునీకరణ పనులు నిర్వహిస్తున్నందున ఆదివారం, సెప్టెంబర్ 6న రంపచోడవరం సబ్‌స్టేషన్ పరిధిలోని ప్రాంతాలకు తాత్కాలికంగా విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. అచ్యుతాచారి తెలిపారు.ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఒక ప్రకటనలో పేర్కొన్నారు.విద్యుత్ మరమ్మతులు, ఆధునీకరణ పనులను దృష్టిలో ఉంచుకుని వినియోగదారులు ముందస్తుగా అవసరమైన ఏర్పాట్లు చేసుకుని విద్యుత్ శాఖకు సహకరించాలని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ పి. అచ్యుతాచారి కోరారు.

అసౌకర్యానికి చింతిస్తున్నామని, పనులు పూర్తయిన అనంతరం విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని తెలిపారు.

## అడ్డతీగల లో ఘనంగా మదర్ థెరిసా వర్ధంతి ...




**అడ్డతీగల, పెన్ పవర్, సెప్టెంబర్ 05;** స్థానిక మండల కేంద్రంలో ఆర్టీసీ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న మదర్ థెరిసా విగ్రహానికి ఆమె వర్ధంతి సందర్భంగా ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ జె. వెంకటేశ్వర మాట్లాడుతూ

పేదలు, అనాథలు, నిరాశ్రయుల సేవకే తన జీవితాన్ని అంకితం చేసిన మదర్ థెరిసా వర్ధంతి నిర్వహించుకోవడం మన బాధ్యత అని ఆయన ఈ సందర్భంగా అన్నారు. జై చిరంజీవ సేవాసమితి నాయకులు గుల్లాల. సురేష్ బాబు ఈ సందర్భంగా మదర్ థెరిసా విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు కుప్పాల. జయరాం మాట్లాడుతూ మదర్ థెరిసా సేవలు ప్రపంచానికి ఆదర్శంగా నిలిచాయని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలిచి, మానవత్వమే పరమ ధర్మంగా భావించి ఆమె చేసిన సేవలను స్మరించుకున్నారు. సీనియర్ పాత్రికేయులు చోడిశెట్టి . సుబ్బారావు మాట్లాడుతూ పేదలు, అనాథలు, రోగుల పట్ల ఆమె చూపిన ప్రేమ, కరుణను ఆయన కొనియాడారు.

ఈ కార్యక్రమంలో ఆకుల. శివ,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దంగేటి . సత్తిబాబు, కాళ్ళ. కృష్ణ మరియు స్థానికులు పాల్గొన్నారు.

## ఎల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయ దినోత్సవం...




**అడ్డతీగల , పెన్ పవర్, సెప్టెంబర్ 05;** అడ్డతీగల మండలం ఎల్లవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ జయంతి ఉత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయ దినోత్సవాన్ని ఇంచార్జ్ ప్రధాన ఉపాధ్యాయులు ఆర్. వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ హెచ్.ఎం ఆర్. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విద్యార్థులు అందరూ చదువు సంధ్యలందు ఎక్కువ శ్రద్ధ చూపి, ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆటల పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థిని, విద్యార్థులకు ఇన్చార్జి ప్రధానోపాధ్యాయులు ఆర్. వెంకటేశ్వర్లు బహుమతులు అందజేశారు .

ఈ కార్యక్రమంలో

ఉపాధ్యాయులు ఆనంద్, కుమారి, రాజేశ్వరి, కౌసల్య దేవి, కే. గంగరాజు, ఆదం రెడ్డి, పిడి. కే .బాపిరాజు దొర, ఎన్.ఎస్ .ఆర్ లీలా భాగ్య, కే. వరలక్ష్మి ,టి. చంటమ్మ, గుమస్తా జి. భాస్కర్ మరియు విద్యార్థినీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మొక్కలు నాటండి,ఆరోగ్యంగా ఉండండి...

-మొక్కలు నాటిన తాసిల్దార్, టిడిపి మండల అధ్యక్షుడు



**కూనవరం,పెన్ పవర్,సెప్టెంబర్ 5.** టీచర్స్ డే సందర్భంగా కూనవరం మండలం పోచవరం కాలనీలో తాసిల్దార్ ధర్మేంద్ర,టీడీపీ మండల అధ్యక్షుడు ఎడవల్లి భాస్కరరావు మొక్కలను నాటారు.ఈ సందర్భంగా ధర్మేంద్ర మాట్లాడుతూ చెట్లు స్వచ్ఛమైన గాలి ఇస్తాయని, ఆరోగ్యానికి మేలు చేస్తాయని తెలిపారు.ప్రతి గ్రామంలో మొక్కలు నాటాలని,స్వచ్ఛభారత్ కార్యక్రమం చేపట్టి గ్రామంలోని ప్రజలు డ్రైనేజీలు శుభ్రంగా ఉంచుకోవాలని పిలుపునిచ్చారు.గ్రామంలో 150 మొక్కలను నాటారు.కార్యక్రమంలో పోడియం అప్పారావు,షేక్ రసూల్, మదర్ సాహెబ్,మాణిక్యం,గుర్రం ప్రసాద్,శీలం వెంకటేశ్వర్లు,శివాజీ, వాసం శ్రీనివాసరావు,వెంకటేశ్వర్లు, యూత్ సభ్యులు,గ్రామ పెద్దలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

